E KABURU - Digital News Paper E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 04-02-2026 (వారం) బుధవారం సంపుటి: 02 || సంచిక: 34 || పేజీలు–6 www.ekaburu.com



హనుమకొండ జూపార్కులో తెల్లపులి మృతి

» 3లో

## 90 శాతానికి పైగా మనవే..



» కాంగ్రెస్‌కే అనుకూలమని సర్వేలు చెబుతున్నాయి..
» మిగిలిన మున్సిపాలిటీలు, కార్పొరేషన్లూ గెలవాల్సిందే
» వచ్చే 10 రోజులు కీలకం.. విస్తృత ప్రచారం చేయాలి
» మంత్రులతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

ఈకబురు, హైదరాబాద్: రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న అన్ని పురపాలికలు, నగరపాలికల్లోనూ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. 90 శాతానికి పైగా మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోబోతోందని, మిగిలిన స్థానాల్లోనూ కచ్చితంగా గెలిచేలా కృషిచేయాలని తెలిపారు. వచ్చే పది రోజులు అత్యంత కీలకమని, ఎన్నికల ప్రచారంలో మంత్రులందరూ పూర్తిస్థాయిలో దృష్టిపెట్టాలని సూచించారు. జూబ్లీహిల్స్ క్యాంప్ కార్యాలయంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, కొండా సురేఖ, వివేక్ వెంకటస్వామి, మహమ్మద్ అజారుద్దీన్, వాకిటి శ్రీహరి, పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్‌రెడ్డిలతో సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం సమావేశమయ్యారు. జిల్లాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రుల నుంచి క్షేత్రస్థాయి పరిస్థితులను సీఎం తెలుసుకున్నారు. పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో రాజకీయ పరిణామాలు, మున్సిపల్ ఎన్నికల్లో

తరువాయి 2లో

# ముగిసిన నామినేషన్ల పర్వం



» బరిలో 12,993 మంది
» 6,701 మంది ఉపసంహరణ
» పలుచోట్ల నాటకీయ పరిణామాలు

**ఈ-కబురు, హైదరాబాద్: అలకలు.. బుజ్జగింపులు.. బెదిరింపులు.. తోపులాటలు.. ధిక్కరణలు.. నామినేషన్ల ఉపసంహరణ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అనేక మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో నెలకొన్న పరిస్థితి ఇది.**

అన్ని ప్రధాన పార్టీలకూ తిరుగుబాట్ల బెడద తాకింది. అతికష్టమ్మీద చాలామందిని ఉపసంహరించుకునేలా చేసినప్పటికీ మొరాయించిన కొద్దిమంది స్వతంత్రులుగానే రంగంలో మిగిలారు. మొత్తంగా ఉపసంహరణల పర్వం పూర్తయిన తర్వాత రాష్ట్రంలోని 2,996 వార్డులకు 12,993 మంది పోటీలో నిలిచారు. 6,701 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఈ నెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేసిన వారు ఉపసంహరించుకునే గడువు మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ముగిసింది. ఒకే వార్డుకు ఒకే పార్టీ నుంచి నలుగురైదుగురు పోటీపడటంతో అనేక చోట్ల నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి.

గద్వాలలో ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకురాలు సరిత వర్గాల మధ్య వివాదం తలెత్తింది. మంగళవారం ఉదయమే కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థులకు బీఫాంలు ఇవ్వగా.. సరిత వర్గీయులు ఏడుగురు తామూ పోటీలో కొనసాగుతామని ప్రకటించారు.

.....తరువాయి 2లో

» 3లో

ప్రణీత్‌రావు డీఎస్పీ హోదా రద్దు



## అమెరికాతో వాణిజ్య ఒప్పందం పెద్ద నిర్ణయం

» ప్రతి ఒక్కరికీ దానివల్ల ప్రయోజనం
» దేశానికి అనుకూలంగానే మా పని
» ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ భేటీలో మోదీ

**ఈ-కబురు, దిల్లీ: అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలనుకోవడం పెద్ద నిర్ణయమని, దేశంలో ప్రతి ఒక్కరికీ దానివల్ల ప్రయోజనం ఉంటుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఇలాంటి ఒప్పందాలైనా, బడ్జెట్ అయినా- అన్నింటా దేశానికి అనుకూలంగానే తమ సర్కారు ఎల్లప్పుడూ పనిచేస్తుందని చెప్పారు.**



తరువాయి3లో

# లోక్‌సభలో అదే రగడ

» 8 మంది విపక్ష సభ్యుల సస్పెన్షన్
» సమావేశాలు ముగిసేదాకా వేటు
» నరవణె పుస్తకంపై కొనసాగిన వివాదం
» దానిపై మాట్లాడనివ్వాలన్న రాహుల్
» పోడియంపైకెక్కి సభ్యుల నిరసనలు
» కాగితాలు చించి స్పీకర్‌పైకి విసిరివేత



ఈకబురు, న్యూఢిల్లీ: లోక్‌సభలో ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఆర్మీ మాజీ చీఫ్ ఎం.ఎం.నరవణె పుస్తకం ఉదంతంపై సోమవారం సభలో రేగిన వివాదం మంగళవారం కూడా కొనసాగింది. దానిపై తనను మాట్లాడనివ్వాలంటూ విపక్ష నేత రాహుల్‌గాంధీ పట్టుబట్టారు. అందుకు సభాపతి అనుమతించకపోవడంతో కాంగ్రెస్‌తో పాటు ఇతర విపక్ష సభ్యులు నిరసనలకు దిగారు. నినాదాలతో సభను హోరెత్తించారు. కాగితాలను చించి స్పీకర్ కేసి విసిరారు. పోడియంపైకి ఎక్కేందుకు ప్రయత్నించారు. ఈ ఉదంతం చివరికి ఎనిమిది మంది విపక్ష సభ్యుల సస్పెన్షన్‌కు దారితీసింది.

...... తరువాయి 2లో

ఉదయం నుంచే...

మంగళవారం ఉదయం సభ ప్రారంభం కాగానే రాహుల్‌గాంధీ మాట్లాడారు. 2020 నాటి భారత్, చైనా ఘర్షణకు సంబంధించి నాటి ఆర్మీ చీఫ్ నరవణె తన పుస్తకంలో పేర్కొన్న అంశాలకు సంబంధించి ఓ మేగజైన్లో వచ్చిన వ్యాసాన్ని సోమవారం ఆయన సభలో ఉటంకించడం, అందుకు స్పీకర్ బిర్లా అభ్యంతరం తెలపడం తెలిసిందే. స్పీకర్ సూచించిన మేరకు సదరు వ్యాసాన్ని తాను ధ్రువీకరిస్తున్నట్టు మంగళవారం రాహుల్ సభలో ప్రకటించారు. ఈ మేరకు దానిపై తాను సంతకం చేసిన కాపీని సమర్పించారు. దాన్ని పరిశీలించాక స్పందిస్తానని సభాపతి స్థానంలో ఉన్న ప్యానెల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు.





## బయోఫార్మా 'శక్తి'తో హైదరాబాద్‌కు మేలు

» జాతీయ రహదారి ప్రాజెక్టుల్లోనే రూ. 42 వేల కోట్లు
» తెలంగాణకు సముచిత నిధులు దక్కాయి
» మెడికల్ టూరిజం హబ్‌ను తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తా
» బడ్జెట్‌పై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్: ఉచితాలు ప్రవేశపెట్టడమే బడ్జెట్ అని కొన్ని రాజకీయ పార్టీలు ఆలోచిస్తున్నాయని, కానీ ఈసారి కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాల సంక్షేమం కోసం వికసిత్ భారత్ లక్ష్యంగా రూపుదిద్దుకుందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఈ బడ్జెట్ ద్వారా ప్రధాని తెలంగాణకు ఇవ్వాల్సినన్ని నిధులు ఇచ్చారని.. జాతీయ రహదారి ప్రాజెక్టుల్లోనే రూ. 42 వేల కోట్లు దక్కడమే ఇందుకు నిదర్శమన్నారు. మంగళవారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

» 2లో

# మౌనంగానే మెడలు వంచి!

» అమెరికాతో వాణిజ్య ఒప్పందం వెనక...
» ఫలించిన మోదీ వేచి చూసే ఎత్తుగడ
» ఇతర దేశాలతో వరుసగా ఒప్పందాలు
» దాంతో ట్రంప్‌పై పెరిగిన ఒత్తిడి
» ఈయూ–భారత్ ఒప్పందంతో బెంబేలు
» దిగొచ్చిన అమెరికా అధ్యక్షుడు



ఈకబురు,అసలే అతను డొనాల్డ్ ట్రంప్. శత్రువులా, మిత్రులా అన్న తేడా కూడా లేకుండా అన్ని దేశాలనూ హడలెత్తిస్తూ వస్తున్న వ్యక్తి! కఠిన పదజాలంతో కూడిన బెదిరింపులతో, ఎడాపెడా టారిఫ్‌ల బాదుడుతో వణుకు పుట్టించడాన్నే తన నైజంగా మార్చుకున్నారు. రెండోసారి అధికారం చేపట్టింది మొదలు, ఈ ఏడాది కాలంలో ప్రపంచ దేశాలకు ఒకరకంగా పీడకలలా పరిణమించారు. చివరికి దక్షిణ కొరియా, బ్రిటన్ వంటి అతి సన్నిహిత మిత్ర దేశాలు కూడా ట్రంప్ బెదిరింపులకు జడిసి ఆయన డిమాండ్లకు అనుగుణంగా అమెరికాతో వాణిజ్య ఒప్పందాలకు తలొగ్గాల్సి వచ్చింది. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ విషయంలో మాత్రం ట్రంప్ హఠాత్తుగా దిగొచ్చిన తీరు ప్రపంచ దేశాలను విస్మయానికి గురి చేస్తోంది. భారత్‌పై 50 శాతం టారిఫ్‌లను ఏకంగా 18 శాతానికి తగ్గిస్తున్నట్టు సోమవారం ట్రంప్ ప్రకటించడం తెలిసిందే. దీన్ని భారత్ సాధించిన ఘన విజయంగా పరిగణిస్తున్నారు. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ఈ విషయంలో తొలినుంచీ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ట్రంప్ బెదిరింపులకు తలొగ్గకుండా, మాటల యుద్ధానికి బదులివ్వకుండా సంయమనం పాటిస్తూనే చివరికి మౌనంగానే ఆయన మెడలు వంచారన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. బెదిరింపులనే తిరుగులేని ఆయుధంగా చేసుకుంటూ గత ఏడాది కాలంలో ట్రంప్ చెలరేగిపోయారు. దేశాధినేతలంతా తాను చెప్పినట్టు వినాలన్న ఒంటెత్తు పోకడ ప్రదర్శించారు. చివరికి నోబెల్ శాంతి పురస్కారానికి తాను అర్హుడినంటూ ప్రకటనలు చేయాల్సిందిగా వారిని ఒత్తిడి చేసే స్థాయికీ వెళ్లారు! పాక్ లాంటి పలు దేశాల అధినేతలు అందుకు తలొగ్గారు కూడా. కానీ మోదీ నుంచి మాత్రం మౌనమే సమాధానమైంది. దాంతో ట్రంప్ ఇగో దెబ్బ తిన్నది కూడా. మోదీ వ్యక్తిగతంగా ఫోన్ చేయనందుకే భారత్‌తో వాణిజ్య ఒప్పందం ఖరారు కాలేదని అమెరికా వాణిజ్య మంత్రి లుట్నిక్ బాహాటంగా చేసిన వ్యాఖ్యలు ఇందుకు అద్దం పట్టాయి. ప్రధాని మాత్రం వీటిని పట్టించుకోలేదు. అంతేగాక ట్రంప్ బెదిరింపుల ఉచ్చులో పడకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించారు.

......తరువాయి 2లో

# సీఈసీని అభిశంసించాలి

» తీర్మానం ప్రవేశపెడితే మేము మద్దతిస్తాం
» పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వెల్లడి



**ఈ-కబురు, న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను అభిశంసించాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీ అన్నారు. ఆయనపై అభిశంసనకు తీర్మానం ప్రవేశపెడితే తాము కచ్చితంగా మద్దతిస్తామని ప్రకటించారు. ఈ విషయంలో ఇతర విపక్ష పార్టీలు సైతం ముందుకు రావాలని కోరారు. ఆమె మంగళవారం ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడారు.**

తరువాయి 2లో

## కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టండి

### భారాస శ్రేణులకు కేటీఆర్ దిశానిర్దేశం

**ఈ-కబురు, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే ప్రజల్లో ఆ పార్టీ పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.**

తరువాయి3లో



# 90 శాతానికి పైగా మనవే..



పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై సుమారు రెండు గంటల పాటు చర్చించారు. నియోజకవర్గాల వారీగా మంత్రులతో సమీక్షించారు. ఏయే పురపాలికల్లో పార్టీ బలంగా ఉంది? ఎక్కడెక్కడ బలహీనంగా ఉంది? ఎక్కడ భారాస, భాజపాల నుంచి గట్టి పోటీ ఎదురయ్యే అవకాశాలున్నాయి? తదితర అంశాల వారీగా ముఖ్యమంత్రి చర్చించారు. సర్వేల్లో వెనుకబడిన మున్సిపాలిటీల్లో పరిస్థితులను ముఖ్యమంత్రి విశ్లేషించారు. ఎప్పటికప్పుడు ఇన్‌ఛార్జి మంత్రులతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. రోజువారీగా నివేదికలను తనకు అందజేయాలని ఆదేశించారు.

గెలుపు బాధ్యత పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌ఛార్జులదే

''మున్సిపాలిటీల వారీగా పార్టీ నిర్వహించిన అంతర్గత సర్వేలు కాంగ్రెస్ అభ్యర్థులకు అనుకూలంగా ఉన్నాయి. భారీ ఆధిక్యం వస్తుందని సర్వేలు చెబుతున్నాయి. దాదాపు 90 శాతానికి పైగా ఓటర్లు కాంగ్రెస్ పార్టీపై, రాష్ట్ర ప్రభుత్వంపై సానుకూలంగా ఉన్నారని తేలింది. అత్యధిక మున్సిపాలిటీలు, నగరపాలికల్లో భారాస, భాజపాలు మనకు దరిదాపుల్లో లేవు. కొన్ని పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో మనం పుంజుకోవాల్సిన అవసరముంది. వీటిలోనూ కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచి తీరాలి. ఎక్కడెక్కడ లోపాలున్నాయో సరిదిద్దుకుంటూ పక్కా వ్యూహంతో ముందుకెళ్లాలి. మంత్రులందరూ పూర్తిస్థాయిలో రంగంలోకి దిగాలి. చిన్న అవకాశాన్ని కూడా జారవిడవద్దు. ప్రతి ఒక్కరినీ కలుపుకొని వెళ్లాలి. సమన్వయంతో, సమష్టిగా ముందుకెళ్లాలి. అసంతృప్త నేతలను బుజ్జగించాలి. ఓట్లు చీలకుండా చూడాల్సిన బాధ్యత స్థానిక నాయకులదే. పాతకొత్త నేతలను సమన్వయం చేసుకోవాలి. గెలుపు బాధ్యత ఆయా పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌ఛార్జులదే.

ప్రత్యర్థి పార్టీలను ఎదుర్కొనేలా..

కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు చేస్తున్న అన్యాయాన్ని ప్రజలకు వివరించాలి. బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరును ఎండగట్టాలి. ఎనిమిది మంది భాజపా ఎంపీలుండి.. వారిలో ఇద్దరు కేంద్ర మంత్రులైనా.. తెలంగాణ అభివృద్ధికి నిధులు తీసుకురావడంలో పూర్తిగా విఫలమైన తీరును ఓటర్లకు తెలియజేయాలి. భారాస ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలను, ఆర్థిక విధ్వంసాన్ని విడమర్చి చెప్పాలి. భారాస, భాజపాలు మన ప్రభుత్వంపై చేస్తున్న అసత్య ప్రచారాలను గట్టిగా తిప్పికొట్టాలి. పోలింగ్ తేదీ వరకూ మంత్రులందరూ సీరియస్‌గా క్షేత్రస్థాయి ప్రచారంలో పాల్గొనాలి. నియోజకవర్గాల్లోనే ఉండి ఎప్పటికప్పుడు రాజకీయ పరిణామాలను పర్యవేక్షిస్తుండాలి. ఏమైనా సమస్యలుంటే ఎప్పటికప్పుడు పీసీసీ చీఫ్, వార్‌రూమ్ దృష్టికి తీసుకెళ్లాలి. అన్ని వార్డుల్లోనూ ఇంటింటికీ విస్తృత ప్రచారం చేయాలి. మన ప్రభుత్వం గత రెండేళ్లుగా అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు, ఉద్యోగాల భర్తీ, అభివృద్ధి పనులు.. తదితర అంశాలను బలంగా తీసుకెళ్లాలి. మనకు ఓటర్లు అనుకూలంగా ఉన్నారు. వారిని పోలింగ్ బూత్ వరకూ తీసుకొచ్చే వరకూ అప్రమత్తంగా ఉండాలి'' అంటూ మంత్రుల సమావేశంలో సీఎం దిశానిర్దేశం చేశారు.

ఈ ఎన్నికల్లో మాకు పోటీ లేదు: మహేశ్‌కుమార్‌గౌడ్

పురపాలిక, నగరపాలిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పోటీయే లేదని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. సీఎంతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ''మున్సిపాలిటీ ఎన్నికలపై చర్చించాం. 90 శాతం స్థానాలు కచ్చితంగా గెలుస్తాం. అన్నిచోట్లా విజయం సాధించడంపై దృష్టి పెడతాం. మంత్రులంతా జిల్లాల్లో ఉండాలని సీఎం సూచించారు. మాకు రెబెల్స్ బెడద లేదు. అంతటా వారు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. జగిత్యాల విషయంలో పరిశీలిస్తున్నాం. సమస్య రేపటితో ముగుస్తుంది. ఏ పార్టీతోనూ మాకు పొత్తులేదు. డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌లు జిల్లాల్లో ఉండడం వల్ల ఈ సమావేశానికి రాలేకపోయారు. వారితో సీఎం ఫోన్‌లో మాట్లాడారు'' అని మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

## బయోఫార్మా 'శక్తి'తో హైదరాబాద్‌కు మేలు



**"ఇది మేధావులు మెచ్చిన బడ్జెట్. తెలంగాణ ప్రజలకు చెప్పేది ఒక్కటే. ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రానికి కావాల్సిన అభివృద్ధి పనులు పూర్తి చేస్తారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఇబ్బంది లేకుండా కొనసాగిస్తాం. హైదరాబాద్ అనేక రంగాలకు కేంద్రంగా మారింది. డేటా సెంటర్ల హబ్, వైద్య ఆరోగ్య పరిశోధన, ఐటీ హబ్.. ఇలా హైదరాబాద్ హబ్‌లకే హబ్‌గా అవతరించింది. వచ్చే అయిదేళ్ల కోసం బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లతో ప్రకటించిన బయోఫార్మా - 'శక్తి' (స్ట్రాటజీ ఫర్ హెల్త్ కేర్ అడ్వాన్స్‌మెంట్ త్రూ నాలెడ్జ్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్) కార్యక్రమం ద్వారా ఫార్మా రాజధానిగా ఉన్న హైదరాబాద్‌కు ఎంతో మేలు జరుగుతుంది. దీని కింద హైదరాబాద్‌లో ఉన్న 'నైపర్'ను మరింత అభివృద్ధి చేయనున్నారు. క్లినికల్ ట్రయల్స్ రంగంలో కూడా 'నైపర్' ద్వారా పరిశోధనలు పెరుగుతాయి. 'ఎస్‌పీఎస్‌సీఐ' పథకం కింద ఇప్పటివరకు రూ. 9502 కోట్లు కేంద్రం ఇచ్చింది.**

రామప్ప ఆలయ అభివృద్ధికి రూ. 73.74 కోట్లు, సోమశిల వెల్‌నెస్ సెంటర్ కోసం రూ. 68.10 కోట్లు కేటాయించింది. త్వరలో ఈ పథకం కింద హైదరాబాద్ అభివృద్ధికి కూడా నిధులు రానున్నాయి. రాష్ట్రానికి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ కింద 1.3 లక్షల ఇళ్లకు రూ.2,190 కోట్లు కేటాయించనుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇదే పథకం కింద రూ.2,160 కోట్లు అందనున్నాయి. హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగానికి రూ.21,629 కోట్లను కేంద్రం కేటాయించింది. దేశంలో 7 హైస్పీడ్ రైల్ ఎలివేటెడ్ కారిడార్లను ప్రకటిస్తే అందులో మూడు హైదరాబాద్ నుంచే ప్రారంభం అవుతాయి. దేశవ్యాప్తంగా 5 మెడికల్ టూరిజం హబ్‌లను ప్రకటించారు. అందులో రాష్ట్రానికి ఒకటి వచ్చేలా నా వంతు కృషి చేస్తా'' అని కిషన్‌రెడ్డి వివరించారు. నైనీ బ్లాక్ టెండర్లపై విచారణకు వేసిన కమిటీపై విలేకరులు అడిగిన ప్రశ్నకు కిషన్‌రెడ్డి బదులిస్తూ.. సింగరేణిని గత భారాస, ఇప్పుడు కాంగ్రెస్ తమ ప్రైవేటు లిమిటెడ్‌లా వాడుకొని.. దోచుకున్నాయని మండిపడ్డారు. నైనీ బ్లాక్ విషయంలో మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయి గొడవలు పెట్టుకుంటున్నారని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

## ముగిసిన నామినేషన్ల పర్వం



నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో కాంగ్రెస్ టికెట్టు దక్కని నలుగురు ఆశావహులు విలేకర్ల సమావేశం పెట్టి.. తమకు అన్యాయం జరిగిందని, నామినేషన్ ఉపసంహరించుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

మిర్యాలగూడలో కాంగ్రెస్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తన ఇద్దరు కుమారులు, భార్యతో నామినేషన్లు దాఖలు చేయించడం చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. బుధవారం ఇక్కడ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన ఉండటంతో ఇది వివాదం కాకుండా మంగళవారం ముగ్గురితోనూ నామినేషన్లు ఉపసంహరింపజేశారు.

ఇటువంటి చిన్నపాటి ఘటనలు మినహా మొత్తంగా ఉపసంహరణల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.

పెద్దసంఖ్యలో అభ్యర్థులు పోటీ పడుతుండటంతో వారికి సర్దిచెప్పడం అగ్రనాయకులకు తలనొప్పిగా మారింది. దీంతో ఈ తతంగాన్ని అన్ని ప్రధాన పార్టీల నాయకులు హైదరాబాద్‌లోని తమ కార్యాలయాల నుంచే పర్యవేక్షించారు.

# మౌనంగానే మెడలు వంచి!



ఒప్పందం విషయమై ట్రంప్ నాలుగుసార్లు స్వయంగా ఫోన్ కాల్స్ చేసినా పట్టించుకోలేదు. ఆయన కారాలు, మిరియాలు నూరుతున్నా లక్ష్యపెట్టకుండా బ్రిటన్, న్యూజిలాండ్, అనంతరం ఒమన్‌లతో లాభదాయక రీతిలో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకున్నారు. తద్వారా స్వతహాగా వ్యాపారి అయిన ట్రంప్‌నే మించిపోయే స్థాయిలో మోదీ వ్యాపార దక్షత ప్రదర్శించారు. ఈ చర్యతో ఆయనను పునరాలోచనలో పడేశారు. ఇక గత నెలలో యూరోపియన్ యూనియన్‌తో అతి కీలకమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని భారత్ ఖరారు చేసుకుంది. ప్రపంచ చరిత్రలోనే అత్యంత భారీదని కొనియాడుతున్న ఈ డీల్ భారత్‌పై దూకుడు విషయంలో ట్రంప్‌కు గట్టిగా బ్రేకులు వేసిందని చెబుతున్నారు.

27 దేశాల కూటమి అయిన ఈయూతో కుదిరిన ఈ ఒప్పందం అంతర్జాతీయ వేదికపై భారత స్థాయిని మరింత పెంచింది. ట్రంప్ చపలచిత్తం పుణ్యమా అని ఇతర దేశాల దృష్టిలో అమెరికా శరవేగంగా విశ్వసనీయతను కోల్పోతూ వస్తోంది. అందుకు విరుద్ధంగా భారత్ మాత్రం అత్యంత నమ్మదగ్గ భాగస్వామ్య దేశంగా తన ప్రతిష్టను పెంచుకుంటూ వచ్చింది. పైగా ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటైన భారత్‌ను ఏ దేశమూ ఇప్పుడు తేలిగ్గా తీసుకునే పరిస్థితి లేదు. ఇందుకు అమెరికా కూడా మినహాయింపు కాదు. అందుకే వ్యవసాయ, పాడి తదితర కీలక రంగాలను అమెరికా పరిశ్రమలకు బాహాటంగా తెరిచేందుకు కరాఖండిగా నిరాకరించి కూడా ఒప్పందానికి ట్రంప్‌ను భారత్ ఒప్పించగలిగింది! అదే సమయంలో ట్రంప్ ఎంతగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా ప్రతి వ్యాఖ్యలకు దిగకుండా మోదీ పరిణతి ప్రదర్శించారు.

చైనాతో స్నేహ గీతం

ట్రంప్ దూకుడుకు చెక్ పెట్టే చర్యల్లో భాగంగా వ్యూహాత్మకంగా చైనాకు దగ్గరయ్యేందుకు కూడా భారత్ వెనకాడలేదు. గతేడాది షాంఘై సహకార సమాఖ్య భేటీకి హాజరయ్యేందుకు ఏడేళ్ల అనంతరం మోదీ చైనాలో పర్యటించారు! ఆ సందర్భంగా చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో కలిసి ఫొటోలకు పోజులిచ్చారు. అవి సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. చివరికి ట్రంప్ కూడా వాటిపై చిర్రుబుర్రులాడారు. భారత్, రష్యాలను అమెరికా చివరికి చైనాకు కోల్పోయిందంటూ నిట్టూర్చారు! ఆ తర్వాత రెండు నెలలకే పుతిన్‌కు ఢిల్లీలో మోదీ రాచమర్యాదలు చేశారు.

రష్యాతో పలు ఒప్పందాలు కూడా కుదుర్చుకున్నారు. ఇలా పలు అగ్ర రాజ్యాలతో భారత్ వ్యూహాత్మకంగా ద్వైపాక్షిక బంధాలను బలోపేతం చేసుకుంటున్న వైనం కూడా ట్రంప్‌ను పునరాలోచనలో పడేసింది. భారత్ అక్కడితోనే ఆగలేదు. ట్రంప్ టారిఫ్‌లకు ప్రతీకా రంగా తాను కూడా అమెరికాపై సుంకాలు బాదింది! అమెరికా నుంచి దిగుమతయ్యే పప్పులు, తృణధాన్యాలపై ఏకంగా 30 శాతం టారిఫ్‌లు విధించింది. ట్రంప్‌లా గొంతెత్తి ప్రకటనలు చేయకుండా మౌనంగానే గత నవంబర్ నుంచే వాటిని వసూలు చేయడం కూడా ప్రారంభించింది.

'ఒప్పందం'పై మోదీ మౌనం

భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదిరిపోయిందని ట్రంప్ ప్రకటించినా, దానిపై మోదీ మాత్రం సూటిగా స్పందించకపోవడం విశేషం. అంతేగాక రష్యా నుంచి చమురు కొనుగోళ్లను పూర్తిగా నిలిపేసేందుకు భారత్ ఒప్పుకుందని, అమెరికా నుంచి దిగుమతులను ఏకంగా 500 బిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లనుందని ట్రంప్ చేసిన వ్యాఖ్యలపైనా మోదీ మౌనమే వహించారు. కేవలం టారిఫ్‌ల తగ్గింపుకు హర్షం వ్యక్తం చేయడానికే తన స్పందనను పరిమితం చేయడం గమనార్హం.

-సాక్షి, నేషనల్ డెస్క్

'గోర్' ఫ్యాక్టర్

సెర్గియో గోర్. భారత్‌లో అమెరికా నూతన రాయబారి. భారత్‌తో అమెరికా వాణిజ్య ఒప్పందం, టారిఫ్‌ల తగ్గింపు వెనక ఆయన పాత్ర కీలకంగా నిలిచింది. ఇరు దేశాల సంబంధాలు కొన్ని దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా దిగజారిన తరుణంలో గత జనవరి 12న ఆయన బాధ్యతలు స్వీకరించారు. ద్వైపాక్షిక సంబంధాలను ఎన్నడూ లేనంత బలోపేతం చేయడమే ఆ సందర్భంగా స్పష్టంగా ప్రకటించారు. 'నిజమైన మిత్రులు తొలుత విభేదించవచ్చు. కానీ అంతిమంగా ఒక్కతాటిపైకే వస్తారు' అని చెప్పుకొచ్చారు. అమెరికాకు భారత్ కంటే ముఖ్యమైన దేశం మరేదీ లేదని కూడా స్పష్టం చేశారు.

ఖనిజాల అన్వేషణ, ఏఐ టెక్నాలజీ వాడకానికి సంబంధించి అమెరికా ఏర్పాటు చేసిన 'పాక్స్ సిలికా' కూటమిలో చేరాల్సిందిగా భారత్‌ను ఆహ్వానించారు కూడా. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై నెలకొన్న సుదీర్ఘ ప్రతిష్టంభన కాస్తా ఆయన వచ్చిన మూడు వారాల్లోపే వీడిపోవడం విశేషం. ట్రంప్‌కు అత్యంత సన్నిహితునిగా గోర్‌కు పేరుంది. ఏ సందర్భంలోనైనా గోర్‌ను తాను పూర్తిగా విశ్వసిస్తానని ట్రంప్ చెబుతుంటారు. భారత్‌తో ఒప్పందం, టారిఫ్‌ల తగ్గింపు విషయంలో ట్రంప్‌పై ఆయన ప్రభావం చాలా ఉన్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు.

మాకు సమాచారం లేదు: రష్యా

మాస్కో: చమురు కొనుగోళ్ల నిలిపి వేతపై భారత్ నుంచి ఇప్పటి దాకా అధికారికంగా ఎలాంటి సమాచారమూ లేదని రష్యా పేర్కొంది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను పూర్తిగా నిలిపేసేందుకు భారత్ అంగీకరించినట్టు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం తెలిసిందే. ఇకపై వెనెజువెలా నుంచే భారత్ అధికంగా చమురు కొనుగోలు చేస్తుందని కూడా ఆయన చెప్పుకొచ్చారు. ఈ నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలపై క్రెమ్లిన్ అధికార ప్రతినిధి ద్మిత్రీ పెస్కోవ్ మంగళవారం ఈ మేరకు స్పందించారు. భారత్‌తో వ్యూహాత్మక బంధాన్ని బలోపేతం చేసుకోవాలన్నదే తమ లక్ష్యమని ఆయన చెప్పారు.

ట్రంప్ వ్యాఖ్య లను నిశితంగా పరిశీలి స్తున్నట్టు రష్యా ఇంధన రంగ వ్యవహారాలు చూసే ఉప ప్రధాని అలెగ్జాండర్ నొవాక్ చెప్పారు. భారత రిఫైనరీల నుంచి ఒప్పందాల రద్దు దిశగా ఎలాంటి నోటీసులూ అందలేదని రష్యా ఇంధన శాఖ వర్గాలు కూడా స్పష్టం చేశాయి. ఉక్రెయిన్‌తో యుద్ధం అనంతరం రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ భారీగా పెంచుకోవడం తెలిసిందే. ఆ దేశం నుంచి అత్యధికంగా చమురు కొనుగోలు చేస్తున్న దేశంగా కూడా నిలిచింది. దీనిపై అమెరికాతో పాటు యూరప్ దేశాలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినా లెక్కచేయని సంగతి తెలిసిందే.

## లోక్‌సభలో అదే రగడ



అయినా నరవణె అంశంపై మాట్లాడేందుకు రాహుల్ తిరిగి ప్రయత్నించారు. దాంతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు అభ్యంతరం తెలిపారు. స్పీకర్ ఒకసారి రూలింగ్ ఇచ్చాక అదే అంశాన్ని పదేపదే లేవనెత్తకుండా అక్కడితో వదిలేయాలని సూచించారు. తాను విపక్ష నేతనని, మాట్లాడేందుకు అనుమతి కోరాల్సిన అవసరం లేదని రాహుల్ బదులిచ్చారు. మేగజైన్‌లోని అంశంపై మాట్లాడి తీరతానని పట్టుబట్టారు. ప్యానెల్ స్పీకర్ మాత్రం ఇతర విపక్ష సభ్యులను మాట్లాడాల్సిందిగా కోరారు. కానీ వరుసగా ముగ్గురు సభ్యులు మాట్లాడేందుకు నిరాకరించారు. తద్వారా రాహుల్‌కు సంఘీభావం ప్రకటించారు. దాంతో ఎన్డీఏ భాగస్వామి టీడీపీకి చెందిన హరీశ్ బాలయోగిని మాట్లాడాల్సిందిగా ప్యానెల్ స్పీకర్ కోరారు.

ఆయన మాట్లాడుతుండగా విపక్ష సభ్యులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. దాంతో సభ పదేపదే వాయిదా పడింది. అయినా పరిస్థితి అదుపులోకి రాకపోగా విపక్ష సభ్యులు కాగితాలు చించి స్పీకర్ కేసి విసిరారు. పోడియంపైకి, లోక్‌సభ సెక్రెటరీ జనరల్ టేబుల్‌పైకి ఎక్కేందుకు ప్రయత్నించారు. దాంతో తీవ్ర గందరగోళం నడుమ సభ మరోసారి వాయిదా పడింది. మధ్యాహ్నం మూడింటికి సభ తిరిగి సమావేశం కాగానే సభాపతి స్థానంలో ఉన్న దిలీప్ సైకియా నేరుగా ఎనిమిది మంది విపక్ష సభ్యులు గుర్జీత్‌సింగ్ ఔజ్లా, హబీ ఈడెన్, సి.కిరణ్‌కుమార్‌రెడ్డి, అమరీందర్‌సింగ్ రజా వారింగ్, మాణిక్కం ఠాగూర్, ప్రశాంత్ పడోలే, డీన్ కురియకోసే (కాంగ్రెస్), ఎస్.వెంకటేశన్ (సీపీ ఎం) పేర్లు చదివి వినిపించారు.

వారిని సస్పెండ్ చేయాల్సిందిగా రిజిజు తీర్మానం ప్రవేశపెట్టారు. సభ్యులు సభ పట్ల, సభాపతి అధికారాల పట్ల అమర్యాదగా ప్రవర్తించారని ఆక్షేపించారు. తీర్మానాన్ని సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది. 8 మంది సభ్యులను ఏప్రిల్ 2న బడ్జెట్ సమావేశాలు ముగిసేదాకా సస్పెండ్ చేస్తున్నట్టు సభాపతి ప్రకటించారు. విపక్ష ఎంపీలు రాహుల్ నేతృత్వంలో పార్లమెంటు ఆవరణలో ధర్నాకు దిగారు.

ప్రజాస్వామ్యానికి తీరని మచ్చ

స్పీకర్ ఓం బిర్లాకు రాహుల్ లేఖ

జాతీయ భద్రతకు సంబంధించిన అంశంపై విపక్ష నేతను లోక్‌సభలో మాట్లాడకుండా అడ్డుకోవ డం ప్రజాస్వామ్యానికే తీరని మచ్చ అని రాహుల్‌గాంధీ మండిపడ్డారు. సభాపతి స్థానంలో ఉన్నవారు సోమ, మంగళవారాల్లో తనతో ప్రవర్తించిన తీరును తీవ్రంగా నిరసిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు ఆయన లేఖ రాశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై విపక్ష నేతను మాట్లాడకుండా అడ్డుకోవడం దేశ చరిత్రలో ఇదే తొలిసారని రాహుల్ అన్నారు. ''కేంద్ర ప్రభుత్వ సూచన మేరకే స్పీకర్ నన్ను మాట్లాడనివ్వకుండా అడ్డుకున్నారు. ఇలా జరగడం మన పార్లమెంటరీ చరిత్రలోనే తొలిసారి!'' అంటూ మండిపడ్డారు.

## సీఈసీని అభిశంసించాలి



బెంగాల్‌లో తమ పార్టీ మద్దతుదారుల ఓట్లను ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్‌ఐఆర్) ముసుగులో తొలగిస్తున్నారని ఆరోపించారు. ఓటర్ల జాబితాలో అక్రమాలకు సీఈసీని జబాబుదారీ చేస్తూ చట్టం తీసుకురావాలంటూ కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన సూచనను మమతా బెనర్జీ గట్టిగా సమర్థించారు. ఇప్పుడు ఓటర్ల జాబితాలో అవకతవకలు జరుగుతున్నాయి కాబట్టి సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను అభిశంసించాలని తేల్చిచెప్పారు. ఈ దిశగా కాంగ్రెస్ ముందడుగు వేస్తే మద్దతిస్తామని అన్నారు.

ఓట్లు తొలగిస్తే బాధితులు ఎక్కడికెళ్లాలి?

బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామన మమతా బెనర్జీ తేల్చిచెప్పారు. ఎన్నికల సంఘాన్ని వాడుకోకుండా తమతో ముఖాముఖి తలపడాలని బీజేపీకి సవాలు విసిరారు. బెంగాల్‌లో ఎస్‌ఐఆర్ వల్ల దళితులు, గిరిజనులు, మైనారిటీలు, అణగారినవర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతోందని, వారి ఓట్లు రద్దవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఎస్‌ఐఆర్‌తో తొలగింపునకు గురైన ఓట్లు వందశాతం తృణమూల్ కాంగ్రెస్ మద్దతుదారులవేనని చెప్పారు. బీజేపీపై అనుమానం రాకుండా ఒకటి రెండు ఓట్లు ఇతర పార్టీల మద్దతుదారులవి కూడా తొలగించి ఉండొచ్చని వ్యాఖ్యానించారు. ఓట్లు తొలగిస్తే వారంతా ఎక్కడికి వెళ్లాలి? అని ప్రశ్నించారు.

నేడు సుప్రీంకోర్టులో విచారణకు మమత హాజరు!

బెంగాల్‌లో ఎస్‌ఐఆర్ చేపట్టడాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టనుంది. ఈ విచారణకు బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వయంగా హాజరయ్యే అవకాశం కనిపిస్తోంది.

# మోటకొండూరు జిల్లా పరిషత్ లో
# పూర్వ విద్యార్థుల సమ్మేళనం

## 1990 బ్యాచ్ విద్యార్థుల సందడి



చదువు చెప్పిన ఉపాధ్యాయులతో కలిసి పూర్వ విద్యార్థులు



ఆత్మీయ సమ్మేళనంలో మోటకొండూరు జిల్లా పరిషత్ పూర్వ విద్యార్థులు



సందడి చేసిన పూర్వ విద్యార్థినులు

- **పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆత్మీయతను పంచుకున్న పూర్వ విద్యార్థులు**
- **పాఠశాలకు విధేయులైన పూర్వ విద్యార్థుల వితరణ**

**ఈ-కబురు, మోటకొండూరు :**

""మూడున్నర దశాబ్దాల క్రితం చదువులమ్మ ఒడిని వీడిన వారంతా నేడు మళ్లీ అక్కడే కలిశారు... జ్ఞాపకాల పందిరిలో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని తమ పాత రోజులను గుర్తు చేసుకున్నారు... తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించుకొని తమని ప్రయోజకులను చేసిన పాఠశాలకు వితరణ సమర్పించుకున్నారు... మరుజన్మ ఉంటే మళ్లీ ఇక్కడే కలవాలని కోరుకుంటూ ఆనందభాష్పాలతో వెనుదిరిగారు...""

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1990 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. పదవ తరగతి వరకు ఇక్కడ విద్యనభ్యసించి వివిధ రంగాల్లో ఉన్నత హోదాల్లో స్థిరపడిన వారంతా ఏకమై తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించుకొని ఆశీర్వాదం తీసుకున్నారు. అప్పట్లో తమకు గురువులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. తాము చదువుకునే రోజులనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆద్యంతం ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి సామాజిక బాధ్యతను చాటుకున్నారు.

అనంతరం 10వేల నగదును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘురాంరెడ్డికి అందజేసి తమ బాధ్యతను నెరవేర్చారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులైన కొంతం అంజిరెడ్డి, పైళ్ళ కృష్ణారెడ్డి, బండ్రు రాజమల్లయ్య, అనంతుల బుచ్చిరెడ్డి, భాస్కరరావు, మధురవాణిలను ఘనంగా సత్కరించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, బిజెపి రాష్ట్రనాయకుడు సింగిరెడ్డి నరోత్తం రెడ్డి,మోదుగుగుంట గ్రామ సర్పంచ్ సోలిపురం ఎల్లారెడ్డి, తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర కార్యదర్శి పైళ్ళ విఠల్ రెడ్డి, కొమురవెల్లి మల్లన్న టెంపుల్ డైరెక్టర్ గొరిగే రవి, మాజీ సర్పంచ్ శోభ, మాజీ ఉపసర్పంచ్ మెట్టు కొండల్ రెడ్డి, విద్యాశాఖ జూనియర్ అసిస్టెంట్ శంకర్, ప్రముఖ వ్యాపారి రావుల శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ ఎస్ శ్రీనివాస్, పి రాజ్యలక్ష్మి, ఆర్ సుష్మ, వై శోభ, ఎస్ నిర్మల, పి సునీత, కే పరమేశ్వరి, వై రజని, సిహెచ్ సత్యలక్ష్మి, జయతున్నిస, వై అలివేలు,నవనీత,జి వీరేశం, జి చంద్రయ్య, వై బిక్షపతి, కే మైసయ్య, బి చంద్రశేఖర్, ఆర్ అనిల్ కుమార్, జి మల్లయ్య, జి కిష్టయ్య, టి గిరిబాబు, పి రాజలింగం, బి రమేష్, ఆర్ శ్రీశైలం, బి నర్సయ్య, పి విఠల్ రెడ్డి, ఏ శ్రీనివాస్, ఆర్ బాల నరసయ్య, బి రాములు, జె బాలయ్య, వై నర్సింహారెడ్డి, ఎం కృష్ణ, బి స్వామి, బి సిద్దయ్య, జి జానకిరామ్, జి బాలయ్య, జి మల్లయ్య, జి రవి, పి నర్సిరెడ్డి, ఎస్ యాదిరెడ్డి, ఎస్ జగదీశ్వర్, పి బాలకృష్ణ, జి రవి, ఏ ఉప్పలయ్య, ఏ శ్రీనివాస్, బి స్వామి, బి నరసింహ, ఐలయ్య శ్రీనివాస్, నరేష్, ఈశ్వరయ్య, యాకూబ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గోపి నగర్ ఈద్గా భూమి ఆక్రమణ యత్నంపై ఎమ్మెల్యే గాంధీకి ఫిర్యాదు

ఈకబురు, శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి మండల పరిధిలోని గోపి నగర్‌లో దశాబ్దాలుగా ముస్లింల ఆధీనంలో ఉన్న ఈద్గా భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని మోతీ మసీదు, ఈద్గా ముస్లిం కమిటీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు కమిటీ సభ్యులు స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, మండల రెవెన్యూ అధికారి, డివిజన్ కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ లకు పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోపి నగర్ సర్వే నంబర్ 64/1లో ఉన్న ఈద్గా భూమి 1973 నుండి ఎటువంటి వివాదాలు లేకుండా ముస్లిం కమ్యూనిటీ ఆధీనంలో ఉందన్నారు. ఇటీవల కొందరు గుర్తుతెలియని వ్యక్తులు మలఫైడ్ ఉద్దేశంతో ఈ భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి, ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈద్గా భూమికి రక్షణ కల్పించాలని కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఒకవేళ ఆక్రమణదారులు తమ ప్రయత్నాలను విరమించుకోకపోతే, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మోతీ మసీదు, ఈద్గా ముస్లిం కమిటీ ప్రతినిధులు, స్థానిక సభ్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గాంధీని కలిసి పిర్యాదు చేస్తున్న మోతీ మసీదు, ఈద్గా ముస్లిం కమిటీ సభ్యులు

# ప్రణీత్‌రావు డీఎస్పీ హోదా రద్దు

ఈకబురు, హైదరాబాద్: ఫోన్ అక్రమ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక నిందితుడు, ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న దుగ్యాల ప్రణీత్‌రావు డీఎస్పీ హోదాను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. డీఎస్పీగా పదోన్నతి పొందిన అనంతరం ప్రొబేషన్ కాలంలో విధుల దుర్వినియోగానికి పాల్పడిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు హోంశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సి.వి.ఆనంద్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గతంలో ప్రణీత్‌రావుకు కల్పించిన యాక్సిలరేటెడ్ పదోన్నతి రద్దయినట్లయింది. ఇకపై ఆయన ఇన్‌స్పెక్టర్‌గానే కొనసాగనున్నారు. సాధారణంగా తీవ్రవాద, ఉగ్రవాద కార్యకలాపాల అణచివేతలో ప్రతిభ కనబరిచిన పోలీస్ అధికారులకు మాత్రమే యాక్సిలరేటెడ్ పదోన్నతి కల్పించే విధానం రాష్ట్రంలో అమల్లో ఉంది. అలాంటి కార్యకలాపాల్లో పనిచేయకపోయినా ప్రణీత్‌రావుకు డీఎస్పీగా పదోన్నతి కల్పించడం అప్పట్లో కలకలం రేపింది. 2007 ఎస్సై బ్యాచ్‌లో దాదాపు 300 మంది ఉండగా.. ఒక్క ప్రణీత్‌రావుకు మాత్రమే డీఎస్పీగా పదోన్నతి కల్పించడం వివాదానికి దారితీసింది. కేవలం ఫోన్ అక్రమ ట్యాపింగ్‌కు పాల్పడినందుకే ప్రణీత్‌రావును అందలం ఎక్కించారనే విమర్శలు అప్పట్లో వెల్లువెత్తాయి.

**ప్రణీత్‌రావు ఎస్సై హోదాలో 2016 అక్టోబరు 24న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ)కు బదిలీ అయ్యారు.**

2023 డిసెంబరు 13 వరకు పనిచేశారు. అక్కడ ఉన్నప్పుడే ఇన్‌స్పెక్టర్‌గా, యాక్సిలరేటెడ్ విధానంలో డీఎస్పీగా పదోన్నతి పొందారు. ఎస్ఐబీలో ఆయన నేతృత్వంలోనే స్పెషల్ ఆపరేషన్స్ టార్గెట్ (ఎస్‌వోటీ) ఏర్పాటైంది. 2023 శాసనసభ ఎన్నికల ఫలితాలు వెలువడిన మరుసటి రోజు (డిసెంబరు 4న) ఎస్ఐబీ భవనంలోని సీసీ కెమెరాలను స్విచ్ఆఫ్ చేసి, ఎస్‌వోటీ లాగర్‌రూంలోని ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లలోని 42 హార్డ్‌డిస్క్‌లు, అందులోని డేటాను ధ్వంసం చేయడంలో ప్రణీత్‌రావు కీలకపాత్ర పోషించినట్లు సిట్ దర్యాప్తులో వెల్లడైంది. 'ఇది టీఎస్‌సీఎస్(కాండక్ట్) రూల్స్, 1964లోని రూల్ నంబర్ 3 ఉల్లంఘన కిందకు వస్తుంది. అతన్ని సస్పెండ్ చేయాలి' అని ఎస్ఐబీ అప్పటి డీఐజీ సూచన మేరకు.. ఇంటెలిజెన్స్ విభాగం నాటి అదనపు డీజీపీ 2024 జనవరి 17న ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ఈ క్రమంలో అదే ఏడాది మార్చి 2న ప్రణీత్‌రావును సస్పెండ్ చేశారు. దీనికితోడు మార్చి 10న ఆయనపై పంజాగుట్ట ఠాణాలో క్రిమినల్ కేసు నమోదైంది. 12న అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ఈ నేపథ్యంలో పదోన్నతి రద్దు చేయాలంటూ డీజీపీ ప్రభుత్వానికి నివేదిక పంపారు. '2023 మార్చి 31న డీఎస్పీగా యాక్సిలరేటెడ్ పదోన్నతి పొందిన ప్రణీత్‌రావు.. ఏడాది తిరగకుండానే(ప్రొబేషనరీ కాలం) అధికార దుర్వినియోగానికి పాల్పడటం ద్వారా సర్వీస్ రూల్స్‌ను ఉల్లంఘించారు' అని నివేదికలో పేర్కొన్నారు. ఈ నివేదిక ఆధారంగా ప్రణీత్‌రావు డీఎస్పీ పోస్టును రద్దు చేశారు.



# అమెరికాతో వాణిజ్య ఒప్పందం పెద్ద నిర్ణయం



మంగళవారం పార్లమెంటు సముదాయంలో జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో కూటమి ఎంపీలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఐరోపా సమాఖ్య (ఈయూ), అమెరికాలతో ఒప్పందాల విషయంలో కూటమి ఎంపీలు ముందుగా ప్రధానిని అభినందించారు. అగ్రరాజ్యంతో ఒప్పందం వల్ల భారత్‌లోని తయారీదారులు, ఎగుమతిదారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు బలపడతారని మోదీ చెప్పారు. 'ట్రంప్ విధించిన సుంకాలపై మమ్మల్ని విమర్శించారు. అయినా సహనంతో ఉన్నాం. అదే ఇప్పుడు గెలిపించింది' అని అన్నారు. ''ఇటీవల జరిగిన పలు ఎన్నికల్లో సాధించిన విజయాలతో సంతృప్తిపడిపోవద్దు. క్షేత్రస్థాయిలో లేకుండా ఎన్నికల్లో గెలవలేం. ప్రజల సంక్షేమం కోసం మంచిపనులు చేస్తుండాలి. పార్లమెంటులో మీరంతా చురుకైన భూమిక పోషించాలి. స్థాయీ సంఘాల ద్వారా ఉత్తమ పనితీరు కనపరచాలి'' అని దిశానిర్దేశం చేశారు.

ఇన్ని ఒప్పందాలు ఓ చరిత్ర: రిజిజు

సమావేశానంతరం కేంద్రమంత్రి కిరణ్ రిజిజు విలేకరులతో మాట్లాడారు. అమెరికాతో ఒప్పందంపై యావద్దేశంలో ఉత్సుకత ఉందని చెప్పారు. ''మోదీ నేతృత్వంలో తొమ్మిది ఒప్పందాలు కొలిక్కి వచ్చాయి. మొత్తం 39 దేశాలతో సంతకాలు జరిగాయి. ఇదొక చరిత్ర'' అని వివరించారు. భాజపా, తెదేపా, జేడీ(యు), ఎల్జేపీ (ఆర్), శివసేన, జేడీ(ఎస్) తదితర భాగస్వామ్య పక్షాలు ఈ సమావేశంలో పాల్గొన్నాయి.

# కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టండి



కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని భారాస శ్రేణులకు సూచించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, మున్సిపల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో మంగళవారం ఆయన టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ''కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ద్రోహాన్ని, హామీల అమలులో చేసిన మోసాన్ని ప్రజలు గమనిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి ప్రజలు కచ్చితంగా బుద్ధి చెబుతారు. రాష్ట్రవ్యాప్తంగా భారాస పార్టీకి అనుకూల వాతావరణం నెలకొంది. రానున్న వారం రోజుల పాటు పార్టీ శ్రేణులంతా సమన్వయంతో కష్టపడితే.. భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయం. గత మున్సిపల్ ఎన్నికల్లో భారాస ప్రభంజనం ముందు ప్రతిపక్షాలు నిలవలేకపోయాయి. ఎన్నికల వ్యూహంలో సమన్వయం కీలకం. పార్టీ విజ్ఞప్తిని మన్నించి నామినేషన్లు ఉపసంహరించుకున్న రెబల్ అభ్యర్థులను సాదరంగా ఆహ్వానించాలి. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి త్యాగం చేసిన ప్రతి నాయకుడి ఇంటికి అభ్యర్థులు వెళ్లి, వారిని ప్రచారంలో భాగస్వాములను చేయాలి. వారికి తగిన గౌరవం ఇచ్చి..కలిసికట్టుగా ముందుకు సాగాల్సిన బాధ్యత మున్సిపల్ సమన్వయకర్తలపై ఉంది. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో.. క్షేత్రస్థాయి పరిస్థితులపై సమగ్ర నివేదికను వెంటనే పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపాలి. చివరి ఘట్టమైన ప్రచారంపై దృష్టిసారిస్తూ.. ప్రతి నిమిషాన్ని సద్వినియోగం చేసుకోవాలి. జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రులు తమ పరిధిలోని మున్సిపాలిటీల్లో విజయావకాశాలను అంచనా వేసి, గెలుపు గుర్రాలను గట్టెక్కించేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలి. పోలింగ్ రోజు ఓటింగ్ శాతం పెంచడంపైనా నాయకులు ప్రత్యేక దృష్టి సారించాలి. ఎన్నికల్లో భారాస ఘనవిజయం సాధించి, అన్ని పట్టణాలపై గులాబీ జెండా ఎగురవేయాలి'' అని కేటీఆర్ పేర్కొన్నారు.

**'రెండు లక్షల ఉద్యోగాలపై మాట తప్పిన సీఎం'**

అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చి.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట తప్పారని కేటీఆర్ విమర్శించారు. ఈమేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ''కేసీఆర్ హయాంలో భర్తీ ప్రక్రియ చివరి దశలో ఉన్న 65 వేల ఉద్యోగాలకు నియామక పత్రాలు ఇచ్చి.. తమ ప్రభుత్వం ఇచ్చినట్లుగా రేవంత్‌రెడ్డి గొప్పలు చెప్పుకొంటున్నారు. గడిచిన రెండేళ్లలో కొత్తగా కనీసం 10 వేల ఉద్యోగాలకు కూడా నోటిఫికేషన్లు ఇవ్వలేకపోయారు. జాబ్ క్యాలెండర్‌కు పాతరేశారు. నిరుద్యోగ భృతి ఊసేలేదు. ఉద్యోగావకాశాలు ఎప్పుడు కల్పిస్తారని నిరుద్యోగులు నిలదీస్తుంటే.. ఐదేళ్లలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని పీసీసీ అధ్యక్షుడితో సీఎం చెప్పిస్తున్నారు. ఉద్యోగాల భర్తీపై నిరుద్యోగులను మోసం చేసినందుకు ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలి. కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు ఆదిలాబాద్ నుంచి అశోక్‌నగర్ చౌరస్తా వరకూ ప్రతి నిరుద్యోగి సిద్ధంగా ఉన్నారు'' అని పేర్కొన్నారు.

# హనుమకొండ జూపార్కులో తెల్లపులి మృతి



హనుమకొండ హంటర్ రోడ్డులోని కాకతీయ జంతు ప్రదర్శనశాలలో తెల్లపులి చరణ్(15) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి మయూరి తెలిపారు. అటవీశాఖ అధికారులు 2025 జులైలో అటవీ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా సందర్శకుల దర్శనార్థం ఈ పులిని అందుబాటులోకి తెచ్చారు. రెండు నెలలుగా అనారోగ్యంతో ఉన్న పులి అకస్మాత్తుగా గుండెపోటుతోపాటు ఊపిరితిత్తులు పనిచేయక మృతి చెందిందని చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ తెలిపారు. సాధారణంగా తెల్లపులి జీవిత కాలం సుమారు 14 ఏళ్లు. జూలోని వెటర్నరీ వైద్యుల పర్యవేక్షణ, సకాలంలో మందులు అందించడంతో 15 ఏళ్ల వరకు జీవించిందని ఆమె పేర్కొన్నారు. మామునూర్‌లోని వెటర్నరీ కళాశాలలో కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించి నమూనాలను హైదరాబాద్‌కు పంపించారు.

# స్వల్పంగా పుంజుకున్న 'తయారీ'



ఈ ఏడాది జనవరిలో దేశీయ తయారీ రంగ కార్యకలాపాలు స్వల్పంగా పుంజుకున్నాయి. కొత్త ఆర్డర్ల రాక ఇందుకు ఉపకరించిందని ఓ నెలవారీ సర్వే తెలిపింది. అయితే వ్యాపార విశ్వాసం మూడున్నరేళ్ల కనిష్ఠానికి పడిందని పేర్కొంది. హెచ్ఎస్‌బీసీ ఇండియా మ్యాన్‌ఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ సూచీ (పీఎంఐ) జనవరిలో 55.4 పాయింట్లకు పెరిగింది. 2025 డిసెంబరులో ఇది రెండేళ్ల కనిష్ఠమైన 55 పాయింట్ల వద్ద ఉంది. పీఎంఐ పరిభాషలో 50 పాయింట్ల ఎగువన ఉంటే ఆ రంగంలో వృద్ధి ఉన్నట్లు, 50 పాయింట్ల దిగువన ఉంటే క్షీణతగానూ పరిగణిస్తారు. జనవరిలో తయారీ రంగ పీఎంఐ సూచీ 50 పాయింట్ల ఎగువన ఉన్నందున.. వృద్ధి ఉన్నప్పటికీ, డిసెంబరుతో పోలిస్తే ఆ వృద్ధి స్వల్పంగానే పెరగడం గమనార్హం. 'భారత తయారీ రంగ సంస్థలు జనవరిలో పుంజుకున్నాయి. కొత్త ఆర్డర్లు, ఉత్పత్తి, ఉద్యోగకల్పన పెరగడం ఇందుకు దోహదం చేసింది. అయితే ముడి సరకు వ్యయాలూ స్వల్పంగా పెరిగాయ'ని హెచ్ఎస్‌బీసీలో ముఖ్య భారత ఆర్థికవేత్త ప్రంజుల్ భండారీ తెలిపారు. గిరాకీ సానుకూలతలు, కొత్త వ్యాపారాల్లో వృద్ధి, సాంకేతిక పెట్టుబడులు లాంటివి ఉత్పత్తికి అండగా నిలిచాయని పేర్కొన్నారు. తయారీ కంపెనీలు నియామకాలను కొనసాగించినప్పటికీ, ఉద్యోగకల్పనలో వృద్ధి ఓ మోస్తరుగానే ఉందని నివేదిక తెలిపింది.

# ప్రభుత్వ రంగ సంస్థల్లో మరిన్ని వాటా విక్రయాలు
## –ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



రాబోయే సంవత్సరాల్లో ప్రభుత్వరంగ సంస్థ (సీపీఎస్ఈ)ల్లో మరిన్ని పెట్టుబడుల ఉపసంహరణలుంటాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. బడ్జెట్ అనంతర విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదాయాలను స్థిరంగా ఉంచేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రుణజీడీపీ నిష్పత్తి ప్రస్తుతం 56% కాగా, 203031 కల్లా 50 శాతానికి చేర్చాలన్నది లక్ష్యమన్నారు. 'పన్ను పరిధిని మరింత విస్తృతం చేయడం ద్వారా ప్రత్యక్ష పన్ను ఆదాయాలు పెంచాలని అనుకుంటున్నాం. మా ప్రాధాన్యత పెట్టుబడుల ఉపసంహరణకే ఉంటుంద'ని మంత్రి స్పష్టం చేశారు. ఐడీబీఐ బ్యాంకులో వాటాల విక్రయం త్వరలోనే పూర్తవుతుందని భావిస్తున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్రం, ఎల్ఐసీ కలిసి ఇందులో 60.72% వాటా విక్రయించాలనుకుంటున్నాయి. 'గోల్డ్ రష్' అందుకే: వినియోగానికి మద్దతు ఇచ్చేందుకు, పెట్టుబడులను ఆయుధంగా మలచడంపై కేంద్ర బడ్జెట్ దృష్టిసారించినట్లు ఆర్థిక మంత్రి వివరించారు. తమ ప్రభుత్వం వృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యతను ద్రవ్య లోటు లక్ష్యమే చెబుతోందన్నారు. ఏటా ఆర్థిక పరిస్థితి ఆధారంగా ఈ లక్ష్యాన్ని నిర్దేశించుకుంటున్నట్లు తెలిపారు. మదుపర్లకు ఏ కరెన్సీపైనా నమ్మకం లేకపోవడం వల్లే, ఇటీవలి కాలంలో బంగారం వెండి వైపు పరుగులు తీశారని అభిప్రాయపడ్డారు. స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌కు సామాన్యులను దూరంగా ఉంచడం కోసమే ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్(ఎఫ్ అండ్ ఓ) ట్రేడ్స్‌పై సెక్యూరిటీ లావాదేవీల పన్ను(ఎస్‌టీటీ) పెంచినట్లు స్పష్టం చేశారు. దివాలా స్మృతి(సవరణ) బిల్లు 2025ను మార్చి 9న ప్రారంభమయ్యే బడ్జెట్ సెషన్లలో ప్రవేశపెడతామని తెలిపారు. ఇప్పటికే పార్లమెంటరీ కమిటీ తన నివేదికను సమర్పించిందన్నారు. ఈ సవరణల వల్ల దివాలా ప్రక్రియ సామర్థ్యం పెరుగుతుందని భావిస్తున్నారు.

# ఒరాకిల్‌లో 30,000 ఉద్యోగ కోతలు!

ఒరాకిల్ తన ఏఐ డేటా కేంద్రాలకు నిధులను అందించేందుకు, వ్యయాలు తగ్గించుకునేందుకు ప్రపంచవ్యాప్తంగా 30,000 మంది ఉద్యోగులను తొలగించే అవకాశం ఉందని ఆంగ్ల పత్రికలు పేర్కొన్నాయి. ఏఐ డేటా కేంద్రాల విస్తరణ కోసం పెట్టుబడులు సమకూర్చేందుకు అమెరికా బ్యాంకులు వెనకడుగు వేస్తున్నందున, కొన్ని కార్యకలాపాలను విక్రయించాలనీ ఒరాకిల్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ అంశాలపై ఒరాకిల్ అధికారికంగా ఎటువంటి ప్రకటనా చేయలేదు.

**––4550 బి. డాలర్ల సమీకరణ!....**

క్లౌడ్ ఇన్‌ఫ్రా పెట్టుబడుల ప్రణాళికలో భాగంగా అదనపు సామర్థ్యాన్ని సమకూర్చుకునేందుకు ఈ ఏడాదిలో 4550 బి. డాలర్ల (దాదాపు రూ.44.55 లక్షల కోట్లు) సమీకరించాలని ఒరాకిల్ భావిస్తున్నట్లు బ్లూమ్‌బర్గ్ తన కథనంలో పేర్కొంది. డెట్, ఈక్విటీ విక్రయాల ద్వారా ఈ నిధుల సమీకరణ జరగొచ్చని తెలిపింది.

ఏఎమ్‌డీ, మెటా, ఎన్విడియా, ఓపెన్ఏఐ, టిక్‌టాక్, ఎక్స్ఏఐ వంటి దిగ్గజం క్లయింట్ల నుంచి పెరుగుతున్న గిరాకీ కారణంగా ,అదనపు సామర్థ్య పెట్టుబడి ప్రణాళికల్లోకి ఉన్నట్లు కంపెనీ సైతం నిర్ధరించింది. ఈ నేపథ్యంలో, కంపెనీ షేరు 3% వరకు నష్టంతో ట్రేడ్ అవుతోంది.

# హెలికాప్టర్ల తయారీ రంగంలోకి అదానీ గ్రూప్
## .. ఇటలీ సంస్థతో ఒప్పందం

దేశీయ పారిశ్రామిక దిగ్గజ సంస్థ అదానీ గ్రూప్ హెలికాప్టర్ల తయారీ రంగంలోకి అడుగుపెట్టింది. ఇటీవలే బ్రెజిల్‌కు చెందిన ఎంబ్రాయెర్‌తో కలిసి దేశీయంగా విమానాలను తయారు చేసే వ్యవస్థ ఏర్పాటు కోసం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న ఆ సంస్థ.. తాజాగా హెలికాప్టర్ల తయారీ ఎకోసిస్టమ్ ఏర్పాటుకు ఇటలీకి చెందిన లియోనార్డో కంపెనీతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం 'మేకిన్ ఇండియా'కు ఊతం ఇవ్వడంతో స్వావలంబనకు తోడ్పడుతుంది. ఈ మేరకు అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, లియోనార్డో సంస్థల ప్రతినిధులు మంగళవారం భాగస్వామ్య ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ భాగస్వామ్యం ద్వారా దేశంలో ఇంటిగ్రేటెడ్ హెలికాప్టర్ తయారీ ఎకోసిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యంగా భారత సైన్యం, వైమానిక దళ అవసరాలను తీర్చే లక్ష్యంతో ఈ భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. లియోనార్డో సంస్థకు చెందిన AW169M, AW109 TrekkerM హెలికాప్టర్లను దేశీయంగా తయారుచేయడం ఈ భాగస్వామ్యం ముఖ్య ఉద్దేశం. దశలవారీగా స్థానిక తయారీ పెంచడంతో పాటు మెయింటెనెన్స్, నిర్వహణ, మరమ్మతు, ఓవర్‌హాలింగ్ (MRO) సామర్థ్యాలు, పైలట్ల శిక్షణ వంటివి ఇందులో భాగంగా ఉంటాయని అదానీ గ్రూప్ ఓ ప్రకటనలో పేర్కొంది. భారత్‌లో హెలికాప్టర్ వినియోగం చాలా తక్కువగా ఉంది. దేశంలో 250 కంటే తక్కువ హెలికాప్టర్లు మాత్రమే ఉన్నాయి. వచ్చే 10 సంవత్సరాల్లో సంవత్సరానికి సుమారు 100 హెలికాప్టర్ల చొప్పున అవసరం పడతాయనేది అంచనా. సాయుధ దళాల కోసం రాబోయే దశాబ్దంలో వెయ్యికి పైగా హెలికాప్టర్ల అవసరం ఉండొచ్చని అదానీ డిఫెన్స్, ఏరోస్పేస్ సీఈఓ అశీష్ రాజ్‌వంశీ తెలిపారు.

ఈ భాగస్వామ్యం ద్వారా దేశంలో సివిల్, డిఫెన్స్ అవసరాలు తీర్చేందుకు పునాది వేశామని అదానీ డిఫెన్స్, ఏరోస్పేస్ డైరెక్టర్ జీత్ అదానీ అన్నారు. భారత్ అతిపెద్ద మార్కెట్ అని, సాయుధ దళాలకు హెలికాప్టర్ల అవసరం పెరుగుతోందని లియోనార్డో హెలికాప్టర్స్ ఎండీ గియాన్ పియరో కుటిల్లో ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# అమాంతం దూసుకెళ్లిన బంగారం, వెండి ధరలు

**––––2008 తర్వాత ఒకరోజు అత్యధిక లాభం**

అంతర్జాతీయంగా బంగారం, వెండి ధరలు మంగళవారం ఒక్కసారిగా దూసుకెళ్లాయి. అంతర్జాతీయ అనిశ్చితుల నేపథ్యంలో, సురక్షితమని భావించడమే కాక.. పలు రంగాల నుంచి వస్తున్న గిరాకీ ఫలితంగా గతవారంలో ఔన్సు (31.10గ్రాముల) బంగారం ధర జీవనకాల గరిష్ఠమైన 5594.82 డాలర్లకు, ఔన్సు వెండి ధర 115.50 డాలర్లకు చేరాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్‌గా వార్ష్‌ను నియమిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించాక, ఈ లోహాల ట్రేడింగ్‌లో భారీ అమ్మకాలు వచ్చాయి. వడ్డీరేట్లు అధికంగా ఉండాలనే వార్ష్ దృక్పథం వల్ల, డాలర్ బలోపేతం అవుతుందనే అంచనాలతో ఈ కమొడిటీల కాంట్రాక్టులను తెగనమ్మడం, వీటికి మార్జిన్లు పెంచడమూ ప్రభావం చూపింది. ఫలితంగా ఔన్సు బంగారం ధర 4403 డాలర్లకు, వెండి ధర 75 డాలర్లకు దిగి వచ్చింది.

**––మళ్లీ గణనీయ మార్పు...** ఈ లోహాల ధరలు అందుబాటులోకి వచ్చాయనే భావనకు తోడు, అమెరికాఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిన తరుణంలో మంగళవారం మళ్లీ భారీగా కొనుగోళ్లు వచ్చాయి. ఫలితంగా 2008 నవంబరు తరవాత ఒక్కరోజులోనే అత్యధికంగా ఈ లోహాల ధరలు పెరిగాయని చెబుతున్నారు. మంగళవారం రాత్రి 11.55 గంటల సమయానికి ఔన్సు బంగారం ధర 292 డాలర్లు (6.3%) పెరిగి 4926 డాలర్లకు, వెండి ధర 6 డాలర్లు (7.5%) అధికమై 83 డాలర్లకు చేరాయి. దేశీయంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి కాస్త బలపడి 90.32 స్థాయికి చేరినా కూడా, ఇక్కడ లోహాల ధరలు పెరిగాయి. 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1,58,500కు, కిలో వెండి ధర రూ.2,79,600 వద్ద స్థిరపడ్డాయి. సోమవారం ఈ ముగింపు ధరలు రూ.1,50,000, రూ.2,48,490 (అన్ని పన్నులతో కలిపి) కావడం గమనార్హం.




# బుల్ బుల్లెట్ పరుగు.. మదుపర్ల సంపద ₹12 లక్షల కోట్లు పైకి

చాలా రోజుల తర్వాత దేశీయ స్టాక్ మార్కెట్‌లో కొత్త ఉత్సాహం కనిపించింది. ఎన్నాళ్లగానో వేచి చూస్తున్న అమెరికాతో ట్రేడ్ డీల్‌పై స్పష్టత రావడంతో దలాల్ స్ట్రీట్‌లో బుల్ రంకెలేసింది. ఉదయం మార్కెట్ ప్రారంభమైనప్పటి నుంచి చివరి వరకు బుల్లెట్‌లా బుల్ రన్ కొనసాగింది. ఫలితంగా సెన్సెక్స్ 2 వేల పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 25,700 ఎగువకు చేరింది. అన్ని రంగాల స్టాక్స్ లాభపడ్డాయి. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.12 లక్షల కోట్లు పెరిగి రూ.467.35 లక్షల కోట్లకు చేరింది. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం రాత్రి ప్రకటించారు. ప్రతీకార సుంకాలనూ 18 శాతానికి తగ్గిస్తున్నామని వెల్లడించారు. అమెరికా దిగుమతులపై విధిస్తున్న సుంకాలను సున్నా స్థాయికి చేర్చడానికి, రష్యా నుంచి చమురు దిగుమతులను నిలిపేయడానికి భారత్ అంగీకరించిందని తెలిపారు. ట్రంప్ ప్రకటనతో ఇప్పటిదాకా భారత్ ఉత్పత్తులపై పడుతున్న 50 శాతం సుంకాలు 18 శాతానికి దిగి రానున్నాయి. ఈ ప్రకటన స్టాక్ మార్కెట్ సూచీలకు కొత్త బూస్ట్ ఇచ్చింది.

బుల్ పరుగు ఇలా: ట్రంప్ ప్రకటన నేపథ్యంలో సెన్సెక్స్ ఆరంభంలోనే దాదాపు 3600 పాయింట్ల లాభంతో 85,323.20 వద్ద (క్రితం ముగింపు 81,666.46) ప్రారంభమైంది. ఓ దశలో 4 వేలకు పాయింట్ల లాభంతో 85,871.73 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 2072.67 పాయింట్ల లాభంతో 83,739.13 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 26,341.20 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 639.15 పాయింట్ల లాభంతో 25,727.55 వద్ద స్థిరపడింది. కోలుకున్న రూపాయి: దేశీయ కరెన్సీ రూపాయి కూడా కోలుకుంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ సోమవారం 91.51గా ఉండగా.. ట్రేడ్ డీల్ నేపథ్యంలో ఒక్కరోజులోనే 1.36 శాతం బలపడి 90.26కి చేరింది. రూపాయి విలువ ఈ స్థాయిలో బలపడడం ఇదే తొలిసారి. ఆ రెండూ మినహా: సెన్సెక్స్ 30 సూచీలో టెక్



మహీంద్రా, బీఈఎల్ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ లాభాల్లో ముగిశాయి. అదానీ పోర్ట్స్ (9.12 శాతం), బజాజ్ ఫైనాన్స్ (6.68 శాతం), ఇండిగో (5.51 శాతం), పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ (283.25), సన్‌ఫార్మా (4.54) చొప్పున లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 66 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4921 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# రైతుల ప్రయోజనాలపై రాజీలేదు
## .. ట్రేడ్‌డీల్ ప్రకటనపై ప్రభుత్వ వర్గాలు

భారత్‌తో ట్రేడ్‌డీల్‌పై అంగీకారానికి వచ్చామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే (IndiaUS Trade deal). అమెరికా ఉత్పత్తులను భారీగా కొనేందుకు భారత్ కట్టుబడి ఉందంటూ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వ వర్గాలు స్పందించాయి. రైతుల ప్రయోజనాల విషయంలో ఎలాంటి రాజీలేదని స్పష్టతనిచ్చాయి. మన దేశానికి అగ్రరాజ్యం ఎగుమతి చేసే వ్యవసాయ, పాడి ఉత్పత్తులపై సుంకాలను తగ్గించేందుకు భారత్ తొలినుంచి అంగీకరించడం లేదు. ఇప్పుడు కూడా అదే విషయాన్ని పునరుద్ఘాటించాయి. అలాగే వెనెజువెలా చమురు కొనుగోలు అంశం పరిశీలనలో ఉందని పేర్కొన్నాయి. అమెరికా (USA) తన రైతులకు భారీగా రాయితీలు ఇస్తుంటుంది. దాంతో వారు తమ ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెటింగ్ ధరల కంటే తక్కువకు అమ్మగలుగుతారు. కొన్ని సందర్భాల్లో పండించడానికి అయిన వ్యయంకంటే కూడా తక్కువకే ఎగుమతి చేస్తారు. వాటిపై భారత్ సుంకాలు తగ్గిస్తే.. మన రైతులపై తీవ్రప్రభావం పడుతుంది. ఇంతకాలం ట్రేడ్‌డీల్ చర్చల్లో ప్రతిష్టంభనకు ఇది కూడా ఒక కారణంగా ఉంది. తాజాగా ట్రంప్ ప్రకటన నేపథ్యంలో.. అమెరికా ఉత్పత్తులపై భారత్ సుంకాలు తగ్గించిందా..? అనే ప్రశ్నలు ఎదురు కాగా, ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ''ఆంక్షలు అమల్లో ఉన్నప్పుడు వెనెజువెలా నుంచి మనం చమురు కొనుగోలు చేయలేదు. ఇప్పుడు వాటిని ఎత్తివేశారు. ఆ చమురును కొంటాం'' అని పేర్కొన్నాయి. ఇంధన కొనుగోళ్ల విషయంలో దేశ ప్రయోజనాలకే ప్రాధాన్యం ఉంటుందని చెప్పాయి. కాగా ట్రంప్ తన పోస్టులో.. ''వాణిజ్యం, రష్యా ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు, రష్యా చమురు కొనుగోలు నిలిపివేత, అమెరికా, వెనెజువెలా నుంచి భారత్ మరింత చమురు కొనుగోలు వంటి అంశాలపై భారత ప్రధాని మోదీతో చర్చలు జరిపాం'' అని రాసుకొచ్చారు. దీనిపై స్పందించిన మోదీ.. సుంకాల తగ్గింపును ధ్రువీకరించారు కానీ.. వాణిజ్య ఒప్పందం గురించి మాత్రం ప్రస్తావించలేదు.



# రూపాయికి టారిఫ్ కష్టాలు తీరతాయా?

ఎట్టకేలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నుంచి మనదేశానికి ఒక శుభవార్త వచ్చింది. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అంగీకరిస్తున్నట్లు ఆయన సోమవారం ప్రకటించారు. భారత ఉత్పత్తులపై ప్రతీకార సుంకం 25%, రష్యా చమురు కొనుగోలు చేస్తున్నందుకు మరో 25% సుంకాన్ని విధిస్తున్న ఆయన.. తాజాగా ప్రతీకార సుంకాన్ని 18 శాతానికి తగ్గించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపేసి, అమెరికా నుంచి తీసుకోవడానికి ఒప్పుకుందని ట్రంప్ ప్రకటించారు. రష్యా చమురు కారణంగా విధించిన 25% సుంకాలను తొలగిస్తున్నట్లు వైట్‌హౌస్ వర్గాలు తెలిపాయి. అమెరికాతో వాణిజ్య ఒప్పందం కుదరకపోవడం వల్లే విదేశీ మదుపర్లు మన మార్కెట్లలో భారీగా అమ్మకాలు జరుపుతున్నారు. ఫలితంగా డాలర్‌కు గిరాకీ పెరిగి, రూపాయి విలువ క్షీణిస్తూ వచ్చింది. తాజా పరిణామాలతో మన మార్కెట్లు, రూపాయి కోలుకుంటాయనే ఆశిస్తున్నారు.

**––భారత వస్తువులపై అమెరికా 50% టారిఫ్ పరిణామాలు ఇలా.....** 2025 ఏప్రిల్ 2 : 'లిబరేషన్ డే' టారిఫ్ చర్యల్లో భాగంగా పలు దేశాల ఉత్పత్తులపై టారిఫ్‌లను ప్రకటించిన ట్రంప్.. భారత్‌పై 26% ప్రతీకార టారిఫ్ విధిస్తున్నట్లు వెల్లడి. ఏప్రిల్ 10: టారిఫ్ అమలును 90 రోజుల పాటు తాత్కాలికంగా ట్రంప్ ఆపారు. అయితే అమెరికాలోకి వెళ్లే అన్ని దిగుమతులపై 10% సుంకాన్ని కొనసాగించారు. జులై 31: అన్ని భారత వస్తువులపై 25% టారిఫ్‌ను ట్రంప్ ప్రకటించారు. రష్యా చమురు కొనుగోలును కొనసాగిస్తే పెనాల్టీ విధిస్తానన్నారు. ఆగస్టు 7: రష్యా చమురు కొనుగోళ్లను భారత్ కొనసాగిస్తోందంటూ, టారిఫ్‌ను 50 శాతానికి పెంచారు. అమెరికా వాణిజ్య భాగస్వాములలో, అత్యంత అధిక టారిఫ్ మనపైనే పడింది.



# మార్కెట్ ఒడుదొడుకులు.. మదుపర్లకు రాధికాగుప్తా సూచనలు

అంతర్జాతీయంగా నెలకొన్న పరిణామాలు దేశీయ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి . ఇక ఇటీవల బడ్జెట్ రోజున అనూహ్యంగా సూచీలు పడిపోయాయి. ట్రంప్ ట్రేడ్‌డీల్ ప్రకటనతో అమాంతం పెరిగాయి. ఈ నేపథ్యంలో ఎడెల్‌వీస్ మ్యూచువల్ ఫండ్ సీఈఓ, ఎండీ రాధికా గుప్తా మదుపర్లకు సూచనలు చేశారు. ఈమేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ''గత నెలరోజులుగా ఈక్విటీలు, డెట్ , కమోడిటీల్లో ఊగిసలాటలు.. మన సహనానికి, సంక్షిష్ట సమయంలో ప్రశాంతంగా ఉండగల సామర్థ్యానికి పరీక్ష పెడుతున్నాయి. ఏదో కోల్పోతామన్న భావనను పక్కనపెట్టి (FOMO), సానుకూల, ప్రతికూల వార్తలపై కొంచెం తక్కువ దృష్టి పెట్టి, వారి పెట్టుబడులకు కట్టుబడి ఉండేవారు బాగా రాణిస్తారు. ఇలాంటి సమయంలో మన ఊహ కంటే స్పందించడమే ఎక్కువ నష్టం చేస్తుంది'' అని ఆమె రాసుకొచ్చారు. ఇలాంటి అస్థిరతల వేళ ఏమీ చేయకుండా ఉండటమే మేలని ఆమె సూచించారు. కాగా.. బడ్జెట్ నేపథ్యంలో ఆదివారం స్టాక్ మార్కెట్లు పనిచేసిన సంగతి తెలిసిందే. అయితే వార్షిక పద్దులో బడ్జెట్‌లో కంపెనీల బైబ్యాక్‌పై పన్ను విధించడంతో పాటు ఫ్యూచర్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్‌ను (STT) పెంచడం మార్కెట్లను కుదిపేసింది. తర్వాత సోమవారం కనిష్ఠాల వద్ద మద్దతు లభించడంతో కాస్త కోలుకున్నాయి. భారత్‌తో ట్రేడ్‌డీల్‌కు అంగీకారం కుదిరిందంటూ ట్రంప్ ప్రకటించడంతో నేడు బుల్ పరుగులు పెట్టిన సంగతి తెలిసిందే.



## కుదిరితే ప్రత్యేకమే!



దక్షిణాది భాషల్లోనే కాకుండా... హిందీలోనూ సినిమాలు చేస్తున్నారు పూజాహెగ్డే, సాయిపల్లవి. ఎన్ని భాషల్లో సినిమాలు చేస్తున్నా... ఈ ఇద్దరికీ తెలుగులో ఉన్న గుర్తింపు ప్రత్యేకం. సాయిపల్లవి గతేడాది 'తండేల్'తో సందడి చేసినా, పూజాహెగ్డే మాత్రం నేరుగా తెలుగు సినిమాల్లో సందడి చేయక చాలా రోజులైంది. ప్రస్తుతం ఈ ఇద్దరి పేర్లూ రెండు కీలకమైన సినిమాల విషయంలో గట్టిగా వినిపిస్తున్నాయి. త్వరలోనే పట్టాలెక్కనున్న ప్రభాస్ 'కల్కి 2' కోసం కథానాయికగా సాయిపల్లవిని ఎంపిక చేయడంపై చిత్రబృందం దృష్టిపెట్టినట్టు సమాచారం. తొలి సినిమా 'కల్కి 2898 ఎ.డి'లో కథానాయికగా దీపికా పదుకొణె నటించిన సంగతి తెలిసిందే. కొనసాగింపు చిత్రంలో దీపిక భాగం కావడం లేదని ఇదివరకే చిత్రబృందం ప్రకటించింది. ఆమె పాత్రని సాయిపల్లవితో కొనసాగిస్తే బాగుంటుందని చిత్రబృందం ఓ నిర్ణయానికి వచ్చినట్టు సమాచారం. ఆ మేరకు సంప్రదింపులు మొదలుపెట్టారట. నాని - సుజీత్ కలయికలో రూపొందనున్న కొత్త చిత్రం విషయంలో పూజాహెగ్డే పేరు ప్రచారంలో ఉంది. 'ఓజీ' సినిమాతో విజయాన్ని అందుకున్న దర్శకుడు సుజీత్...'బ్లడీ రోమియో' పేరుతో నాని కోసం ఓ స్క్రిప్ట్‌ని సిద్ధం చేశారు. ఆ సినిమా కోసమే చిత్రబృందం పూజాహెగ్డేని సంప్రదించినట్టు తెలిసింది. పాత్రలు, పారితోషికాలు, కాల్‌షీట్లు... ఇలా అన్నీ కుదిరితే ఈ కలయికలో సినిమాలు ఖరారయ్యే అవకాశాలే ఎక్కువన్నది పరిశ్రమ వర్గాల మాట. కుదిరితే మాత్రం తొలిసారి జట్టు కట్టనున్న ఈ కాంబినేషన్లు ఎంతో ప్రత్యేకం కానున్నాయి.



## వాళ్లకు మనస్సాక్షి ఉండదా!

హిందీ చిత్రపరిశ్రమలో పబ్లిసిటీ సంస్కృతిని తీవ్రంగా విమర్శించింది నటి రకుల్ ప్రీత్ సింగ్. అంతేకాదు నటులు నిజాయతీగా పనిచేస్తే పీఆర్‌లు లేకపోయినా సొంత గుర్తింపుని పొందగలరని వ్యాఖ్యానించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్ మాట్లాడుతూ.. "పీఆర్ వ్యవస్థలు ఒక స్థాయి వరకూ మాత్రమే పనిచేయగలవు. మనం కష్టపడి పని చేసినప్పుడే ఇండస్ట్రీలో దానికి తగిన ఫలితం వస్తుంది. గతంతో పోలిస్తే హిందీ చిత్ర పరిశ్రమలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. డబ్బు చెల్లించి ఇతరులపై బురద చల్లిస్తున్నారు. ఇంత నెగెటివిటీ సృష్టించే వాళ్లకు నిద్ర ఎలా పడుతుందో అని ఎప్పుడూ అనుకుంటాను. వాళ్లకు నిజంగా మనస్సాక్షి ఉండదా అనిపిస్తుంది. ఇలాంటి వాళ్లు ఎప్పటికైనా ఇబ్బందులు ఎదుర్కోక తప్పదు. నేను స్వయంగా ఎదిగి ఈ స్థాయికి వచ్చాను"అని అన్నారు. అంతేకాదు తాను నెలలో ఏ దుస్తులు ఎన్నిసార్లు వేసుకుంటున్నానో కూడా కొందరు ఫొటోగ్రాఫర్లు చెబుతున్నారు. ఈ విషయంలో ఓ హద్దు ఉండాలని చెప్పారు. అలానే తాను దుస్తులకు అంతగా ప్రాధాన్యం ఇవ్వనని తెలిపారు. రకుల్ తదుపరి 'పతి పత్ని ఔర్ వో దో'లో నటిస్తుంది.



## ప్రతీకారానికి ధురంధర్ సిద్ధం



బాక్సాఫీస్ వద్ద కలెక్షన్లతో పాటు సరికొత్త రికార్డులను సృష్టించింది 'ధురంధర్' సినిమా. రణ్‌వీర్‌సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఈ సినిమా ప్రేక్షకులను మెప్పించింది. దీనికి సీక్వెల్ రానున్నట్లు గతంలోనే వెల్లడించింది చిత్రబృందం. తాజాగా ఈ సీక్వెల్ 'ధురంధర్: ది రివెంజ్' పేరుతో మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుందని ప్రకటించింది. ఈ సందర్భంగా పోస్టర్, టీజర్‌లను చిత్రబృందం సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. రణ్‌వీర్ యాక్షన్ సన్నివేశాలతో ప్రారంభమైన ఈ టీజర్.. "ఇది కొత్త భారతదేశం.. సరిహద్దులను దాటి చొచ్చుకువచ్చి దెబ్బకొట్టి తీరుతుంది" అనే హీరో రివెంజ్ డైలాగ్, నేపథ్యగీతంతో ఆకట్టుకునేలా ఉంది. తొలిభాగం కేవలం హిందీలో మాత్రమే విడుదలకాగా ఈసారి ఈ సినిమాని హిందీతోపాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లోనూ విడుదల చేయనున్నారు.



## ఆ పర్యటన నేర్పిన పాఠాలెన్నో!

ఒకానొక టైమ్‌లో అసలేం చేస్తున్నానా.. అనే ఆలోచనతోనే చిత్ర పరిశ్రమ నుంచి కొంతకాలం విరామం తీసుకున్నట్లు నటుడు మాధవన్ తెలిపారు. 'సాలా ఖడూస్' చిత్రానికి ముందు తను చేస్తున్న పనుల కారణంగా విశ్రాంతి అవసరమనిపించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన తన కెరీర్‌లోని పలు జ్ఞాపకాలను పంచుకున్నారు. "నేను స్విట్జర్లాండ్‌లో ఓ పాట చిత్రీకరణ కోసం రోడ్డు మధ్యలో నిల్చున్నాను. అక్కడే కూర్చున ఓ రైతు మమ్మల్ని నిర్లక్ష్యంగా చూడడం గమనించాను. ఆ సన్నివేశం నాకు బాధనిపించింది. అప్పుడ[ు అతనివైపు చూసి చెన్నైకి రా నేనెవరో నీకు చూపిస్తానని మనసులో అనుకున్నాను. కానీ, వెంటనే ఓ ఆలోచన నాలో చేరింది. నటుడిగా ఎన్నో పాత్రలు చేసి స్టార్ అయ్యాను కానీ వ్యక్తిగతం నేను ఏం సాధించాను అనే ప్రశ్న నాలో మొదలైంది. అందుకే నన్ను నేను తెలుసుకోవడానికి షూటింగ్‌లకు స్వస్తి చెప్పి దేశవ్యాప్తంగా తిరిగాను. గడ్డం పెంచుకొని సాధారణ వ్యక్తిలా చెన్నై చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు భారత్‌లోని ఎన్నో అందమైన ప్రదేశాలకు వెళ్లాను. అక్కడ రిక్షా వాళ్ల దగ్గరనుంచి ప్రతి ఒక్కరితో మాట్లాడాను. వారి జీవనశైలి, వాళ్లు చేస్తున్న పనిలో వారిని ఇబ్బంది పెట్టే విషయాల గురించి తెలుసుకున్నా. ఆ పర్యటన నాకు జీవితంలో ఎన్నో పాఠాలు నేర్పింది" అని మాధవన్ అన్నారు.

## తర్వాత ఈ సిరీస్‌తోనేనా?

కథానాయకుడు నాగచైతన్య ప్రస్తుతం 'వృషకర్మ' సినిమాని ముగించే పనిలో ఉన్నారు. కార్తీక్ దండు తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాదే తెరపైకి రానుంది. కానీ, దీని తర్వాత చైతన్య చేయనున్న ప్రాజెక్ట్ ఏదన్నది ఇంకా తేలలేదు. అయితే ప్రస్తుతం దీనికి సంబంధించిన ఓ ఆసక్తికర వార్త వినిపిస్తోంది. చైతూ తన హిట్ వెబ్‌సిరీస్ 'దూత'కు కొనసాగింపుగా 'దూత 2'ను పట్టాలెక్కించే సన్నాహాల్లో ఉన్నారని సమాచారం. ఇప్పటికే దర్శకుడు విక్రమ్ కె కుమార్ దీనికి సంబంధించిన స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారని.. పూర్వ నిర్మాణ పనులు మొదలయ్యాయని తెలుస్తోంది. దీన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ నిర్మించే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది.



## రయ్.. రయ్ బైకర్

ఈ సంక్రాంతికి 'నారీ నారీ నడుమ మురారి'తో ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్వించారు కథానాయకుడు శర్వానంద్. ఇప్పుడీ వేసవిలో 'బైకర్'తో మరోమారు థియేటర్లలో సందడి చేయనున్నారు. శర్వా టైటిల్ పాత్రలో నటించిన ఈ చిత్రాన్ని అభిలాష్ కంకర తెరకెక్కించారు. యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మించింది. మాళవిక నాయర్ కథానాయిక. ఈ సినిమాని ఏప్రిల్ 3న విడుదల చేయనున్నట్లు మంగళవారం ప్రకటించారు. ఇది మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంతో ముడిపడిన పీరియాడిక్ థ్రిల్లర్. ప్రేమ, కుటుంబ భావోద్వేగాలతో నిండి ఉంటుంది. హీరో రాజశేఖర్ ఇందులో ఓ ప్రత్యేక పాత్రలో అలరించనున్నారు. బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి సంగీతం: జిబ్రాన్, ఛాయాగ్రహణం: జె.యువరాజ్.



# ఫామ్‌లేమి చీకట్లను చీల్చుకుంటూ.. పరుగుల సూరీడు మళ్లీ ఉదయించాడు..!

మరికొన్ని రోజుల్లోనే టీ20 వరల్డ్‌కప్ (ICC Mens T20 World Cup) 2026 భారత్, శ్రీలంక వేదికగా ప్రారంభం కానుంది. అయితే న్యూజిలాండ్‌తో అయిదు టీ20 మ్యాచ్‌ల సిరీస్ ముందు వరకు టీమ్ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫామ్‌లేమిని భారత్‌ను ఇబ్బంది పెట్టింది. కానీ కివీస్‌తో పొట్టి సిరీస్‌లో సూర్యకుమార్ యాదవ్ మూడు హాఫ్‌సెంచరీలతో తన సత్తా చాటాడు. ఇందులో రెండు వరుస అర్ధ శతకాలున్నాయి. అలాగే ఈ సిరీస్‌లో టాప్‌స్కోరర్‌గానూ నిలిచాడు.

**--2025లో తప్పని తడ'బ్యాటు'.....** సూర్యకుమార్ యాదవ్ 2025లో ఫామ్‌లేమితో తడ'బ్యాటు'కు గురయ్యాడు. టీ 20 వరల్డ్ కప్ 2024 నుంచి.. డిసెంబర్ 2025 వరకు అతడు 28 ఇన్నింగ్స్‌ల్లో 17.92 యావరేజ్‌తో కేవలం 448 పరుగులే చేశాడు. ఇందులో రెండు అర్ధశతకాలు మాత్రమే ఉన్నాయి. 23 ఇన్నింగ్స్‌ల వరకు సూర్య అసలు హాఫ్‌సెంచరీనే చేయలేదు.

**---కివీస్ సిరీస్‌తో రిథమ్‌లోకి.....** కివీస్‌తో జరిగిన టీ20 సిరీస్‌తో సూర్య తిరిగి రిథమ్‌లోకి వచ్చాడు. మొదటి మ్యాచ్‌లో 32, రెండో టీ20లో 82* (కేవలం 37 బంతుల్లో), మూడో మ్యాచ్‌లో 57*, అయిదో టీ20లో 63 పరుగులు సాధించాడు. నాలుగో మ్యాచ్‌లో మాత్రం 8 రన్స్ చేశాడు. మొత్తానికి ఈ మూడు హాఫ్‌సెంచరీల్లో రెండుసార్లు అజేయంగా నిలిచాడు. ముఖ్యంగా రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో టీ20లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. మూడో మ్యాచ్‌లోనూ మరో అర్ధశతకం బాది తాను ఫామ్‌లోకి వచ్చినట్లు నిరూపించాడు.

**సూర్య మెరుపులు తోడైతే..** కివీస్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో సూర్యకుమార్ యాదవ్ 80.66 యావరేజ్, 196.74 స్ట్రైక్ రేట్‌తో 242 పరుగులు సాధించి, టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. విధ్వంసక ఓపెనర్ అభిషేక్ శర్మ (182 పరుగులు) కంటే కూడా ఎక్కువ రన్స్ సాధించడం గమనార్హం. టీ20 వరల్డ్‌కప్ 2026లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత్‌కు సూర్య ఫామ్ అదనపు బలం కానుంది. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ వీరబాదుడుకు సూర్య మెరుపులు తోడైతే.. స్కోర్ బోర్డ్ పరుగులెత్తడం ఖాయం. ప్రత్యర్థులు బిత్తరపోయి చిత్తవడం తథ్యం.. అని అభిమానులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.



# పాట్ కమిన్స్ ఐపీఎల్‌కు దూరమైతే.. హైదరాబాద్ తదుపరి కెప్టెన్ ఎవరు?



వెన్ను గాయం కారణంగా ఆసీస్ క్రికెటర్ పాట్ కమిన్స్ టీ20 వరల్డ్‌కప్ (ICC Mens T20 World Cup) 2026కు దూరమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాను ఐపీఎల్‌కు (IPL) ఆడే విషయంలోనూ అనిశ్చితి ఉందని, అందుబాటులో ఉంటానా? లేదా అనే విషయం ఇప్పుడే చెప్పలేనన్నాడు. 'అడిలైడ్ టెస్ట్ మ్యాచ్ తర్వాత గాయం నుంచి కోలుకోవడానికి నాలుగు నుంచి ఎనిమిది వారాల సమయం పడుతుందని తెలుసు. మొదట్లో, చాలా బాగున్నట్లు అనిపించడంతో కేవలం నాలుగు వారాలు సరిపోతుందని భావించా. కానీ తదుపరి స్కానింగ్ తర్వాత, కోలుకోవడానికి మరో రెండు వారాలు అవసరమని తేలింది' అని పాట్ కమిన్స్ వెల్లడించాడు. అందుకే టీ20 వరల్డ్‌కప్ 2026లో పాల్గొనే విషయంలో రిస్క్ చేయదలుచుకోలేదన్నాడు. అలాగే ఐపీఎల్‌లో పాల్గొనే విషయాన్నీ ఇప్పుడే ఎటూ తేల్చలేదు. దీంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ అభిమానులు ఒకింత ఆందోళనకు గురవుతున్నారు.

**--ఇబ్బందులు తప్పవా?....** సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు కమిన్స్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఒక వేళ అతడు ఐపీఎల్‌కు దూరమైతే హైదరాబాద్ జట్టుకు ఇబ్బందులు తప్పేలా లేవు. బౌలింగ్ దళం బలహీనపడనుంది. దీంతోపాటు తదుపరి కెప్టెన్ ఎవరనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ముఖ్యంగా జట్టులో సీనియర్ ప్లేయర్లు ఎవరూ లేరు! అలాగే ఇంతకు ముందు కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వహించిన ఆటగాళ్లూ కనిపించడం లేదు!

**--ఈ నలుగురిలో ఎవరు?...** సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు కమిన్స్ సారథి అయితే, అభిషేక్ శర్మ , ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్ నాలుగు స్తంభాల్లాంటి వారు. వీరిలో ఎవరో ఒకరు తదుపరి కెప్టెన్ బాధ్యతలు నిర్వహించాల్సి వస్తుంది. అభిషేక్ శర్మ బ్యాటింగ్‌పై ప్రభావం పడుతుందన్న ఉద్దేశంతో ఆ జట్టు యాజమాన్యం అదనపు బాధ్యతలు ఇవ్వకపోవచ్చు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఇషాన్ కిషన్ గొప్పగా రాణించాడు. దీంతో అతడు కెప్టెన్సీ రేసులో ఉంటాడు. కమిన్స్ స్థానంలో విదేశీ ప్లేయర్‌కే కెప్టెన్సీ ఇవ్వాలనుకుంటే మాత్రం.. ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్ వీరిలో ఎవరో ఒకరిని అదృష్టం వరించొచ్చు.

**--బౌలింగ్‌లో ఎలా?....** పాట్ కమిన్స్ బౌలింగ్ గురించి మనందరికీ తెలిసిందే. హైదరాబాద్ జట్టు టాప్‌ఆర్డర్ బ్యాట్‌తో వీరవిహారం చేస్తే.. పాట్ కమిన్స్ నేతృత్వంలో పేస్ దళం ప్రత్యర్థి జట్టును పరుగులు చేయకుండా కట్టడి చేస్తుంది! కానీ ఒక వేళ కమిన్స్ జట్టుకు దూరమైతే.. పేస్ విభాగం బలహీనపడుతుంది. జీషన్ అన్సారీ, జయదేవ్ ఉనద్కత్, ఎషన్ మలింగలాంటి బౌలర్లపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. ప్రత్యర్థి జట్టును కట్టడి చేయడమంటే వీరికి తలకు మించిన పనే అవుతుంది. ఈ నేపథ్యంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు, అభిమానులు పాట్ కమిన్స్ గురించి ఒకింత ఆందోళనకు గురవుతున్నారు. అతడు గాయం నుంచి కోలుకుని మార్చి 26లోపు జట్టుకు అందుబాటులోకి రావాలని కోరుకుంటున్నారు. కానీ చాలా తక్కువ సమయం ఉన్నందున పాట్ కమిన్స్ విషయంలో ఆందోళన తప్పేలా లేదు. ఏది ఏమైనా ఈ విషయంలో ఓ క్లారిటీ రావాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

# ఢిల్లీ.. ఫైనల్లో మళ్లీ

## వరుసగా నాలుగోసారి టైటిల్ పోరుకు అర్హత ఎలిమినేటర్‌లో గుజరాత్‌పై విజయం



ఢిల్లీ క్యాపిటల్స్ అదరహో! ఆల్‌రౌండ్ సత్తా చాటిన ఆ జట్టు.. పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. బ్యాటుతో లిజెలి, జెమీమా.. బంతితో షినెలి మెరవడంతో ఎలిమినేటర్‌లో గుజరాత్‌ను చిత్తు చేస్తూ వరుసగా నాలుగో డబ్ల్యూపీఎల్ సీజన్‌లో ఢిల్లీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఢిల్లీ మెరిసింది. మంగళవారం ఏకపక్షంగా సాగిన ఎలిమినేటర్‌లో 7 వికెట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. మొదట గుజరాత్ 7 వికెట్లకు 168 పరుగులు చేసింది. షినెలి హెన్రీ (3/35), నందని శర్మ (2/44), మిన్ను మణి (1/23) ఆ జట్టుకు కళ్లెం వేశారు. బెత్ మూనీ (62 నాటౌట్; 51 బంతుల్లో 6×4) టాప్ స్కోరర్. జార్జియా వేర్‌హామ్ (35; 25 బంతుల్లో 3×4, 1×6) రాణించింది. ఛేదనలో ఢిల్లీ చెలరేగిపోయింది. లిజెలి లీ (43; 24 బంతుల్లో 8×4, 1×6), కెప్టెన్ జెమీమా (41; 23 బంతుల్లో 4×4, 1×6) మెరవడంతో 15.4 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి అలవోకగా లక్ష్యాన్ని అందుకుంది. జెమీమాకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఢిల్లీ గురువారం జరిగే ఫైనల్లో బెంగళూరును ఢీకొంటుంది. ఢిల్లీ డబ్ల్యూపీఎల్ తొలి మూడు సీజన్లలోనూ ఫైనల్ చేరినా.. కప్పు గెలవలేకపోయింది. ఈసారైనా విజేతగా నిలుస్తుందో లేదో చూడాలి.

**--ఢిల్లీ ధనాధన్:** ఛేదనలో ఢిల్లీ బ్యాటర్లపై గుజరాత్ బౌలర్లు ప్రభావం చూపలేకపోయారు. బౌండరీల మోత మోగించిన ఓపెనర్లు లిజెలీ, షెఫాలి (31; 21 బంతుల్లో 7×4) స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. లిజెలి మూడు ఫోర్లు, షెఫాలి రెండు ఫోర్లు బాదడంతో ఓ ఓవర్లో రేణుక 21 పరుగులు సమర్పించుకుంది. ఢిల్లీ 7 ఓవర్లకే 89/0తో నిలిచింది. జార్జియా వేర్‌హామ్ వేసిన తర్వాతి ఓవర్లోనే ఓపెనర్లు ఇద్దరూ నిష్క్రమించినా.. వోల్వార్ట్ (32 నాటౌట్; 24 బంతుల్లో 2×4, 1×6), జెమీమా రెండో వికెట్‌కు 68 పరుగులు జోడించి, ఢిల్లీని విజయం వైపు నడిపించారు. చక్కని షాట్లతో అలరించిన జెమీమా 15వ ఓవర్లో ఔట్ కాగా.. మరిజేన్ (4 నాటౌట్)తో కలిసి వోల్వార్ట్ లాంఛనం పూర్తి చేసింది.

**---రాణించిన మూనీ:** ఢిల్లీ బౌలర్లు అంతకుముందు గుజరాత్ జెయింట్స్‌కు కళ్లెం వేశారు. ఓపెనర్ బెత్ మూనీ నిలవడంతో జెయింట్స్ పోటీ ఇచ్చే స్కోరు చేయగలిగింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్‌ను బౌలర్లు ఒత్తిడికి గురిచేశారు. ఆరంభమే ఆ జట్టుకు పెద్ద షాక్. గుజరాత్ 9 ఓవర్లలో 60 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి చిక్కుల్లో పడింది. ఓపెనర్ సోఫీ డివైన్ (6)ను ఔట్ చేయడం ద్వారా ఆ జట్టును రెండో ఓవర్లోనే షినెలి దెబ్బతీసింది. జాగ్రత్తగా ఆడుతున్న మూనీకి తోడుగా అనుష్క శర్మ (16) నిలిచింది కానీ.. అది కాసేపే. ఆరో ఓవర్లో అనుష్క, ఆష్లీ గార్డ్‌నర్‌లను నందని వరుస బంతుల్లో ఔట్ చేసింది. 9వ ఓవర్లో కనికను మణి వెనక్కి పంపింది. అయితే మరోవైపు నుంచి క్రమం తప్పకుండా వికెట్లు పోతున్నా మూనీ పట్టుదలగా నిలిచింది. కానీ ధాటిగా ఆడలేదు. ఆమెకు ఎట్టకేలకు వేర్‌హామ్ రూపంలో సహకారం లభించింది. మూనీ యాంకర్ పాత్రను కొనసాగించగా.. కుదురుకున్నాక ఎదురుదాడికి దిగిన వేర్‌హామ్ మూడు ఫోర్లు, ఓ సిక్స్‌తో ఇన్నింగ్స్‌కు ఊపునిచ్చింది. కానీ గుజరాత్ ఇన్నింగ్స్ జోరందుకుంటున్న సమయంలో వేర్‌హామ్‌ను షినెలి ఔట్ చేయడంతో అయిదో వికెట్ భాగస్వామ్యానికి 61 పరుగుల వద్ద తెరపడింది. 17వ ఓవర్లో వేర్‌హామ్ వెనుదిరిగే సమయానికి గుజరాత్ స్కోరు 120. వెంటనే ఫుల్మాలి కూడా ఔటైనా.. కష్వీ గౌతమ్ (18)తో కలిసి మూనీ మరో విలువైన భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. జట్టు స్కోరు 160 దాటించింది. ఏడో వికెట్‌కు మూనీతో కలిసి 39 పరుగులు జోడించిన కష్వీ.. ఆఖరి ఓవర్లో నిష్క్రమించింది. మూనీ, కష్వీ బ్యాట్లు ఝుళిపించడంతో ఆఖరి రెండు ఓవర్లలో గుజరాత్‌కు 61 పరుగులొచ్చాయి.

**--గుజరాత్ జెయింట్స్ ఇన్నింగ్స్:** మూనీ నాటౌట్ 62; సోఫీ డివైన్ (సి) లిజెలి లీ (బి) షినెలి 6; అనుష్క శర్మ (సి) షినెలి (బి) నందని 16; గార్డ్‌నర్ (సి) స్నేహ్ (బి) నందని 0; కనిక (స్టంప్డ్) లిజెలి (బి) మిన్ను మణి 6; వేర్‌హామ్ (సి) వోల్వార్ట్ (బి) షినెలి 35; భార్తీ ఫుల్మాలి (సి) అండ్ (బి) షినెలి 0; కష్వీ రనౌట్ 18; తనూజ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 25 మొత్తం: (20 ఓవర్లలో 7 వికెట్లకు) 168 వికెట్ల పతనం: 19, 238, 338, 459, 5120, 6125, 7164; బౌలింగ్: మరిజేన్ కాప్ 40320; షినెలి హెన్రీ 40353; నందని శర్మ 40442; మిన్ను మణి 40231; స్నేహ్ రాణా 1030; శ్రీచరణి 30250. **--ఢిల్లీ ఇన్నింగ్స్:** లిజెలి లీ ఎల్బీ (బి) వేర్‌హామ్ 43; షెఫాలి వర్మ (బి) వేర్‌హామ్ 31; లారా వోల్వార్ట్ నాటౌట్ 32; జెమీమా (సి) సోఫీ డివైన్ (బి) రాజేశ్వరి 41; మరిజేన్ కాప్ నాటౌట్ 4; ఎక్స్‌ట్రాలు 18 మొత్తం: (15.4 ఓవర్లలో 3 వికెట్లకు) 169; వికెట్ల పతనం: 189, 292, 3160; బౌలింగ్: రేణుక సింగ్ 20270; కష్వీ గౌతమ్ 20170; రాజేశ్వరి గైక్వాడ్ 30331; సోఫీ డివైన్ 30350; జార్జియా వేర్‌హామ్ 3.40282

# డబ్ల్యూపీఎల్‌లోకి చెన్నై సూపర్ కింగ్స్!




చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులకు సీఈఓ కాశీ విశ్వనాథన్ మంచి శుభవార్త చెప్పారు. ఐపీఎల్‌లో మేటి జట్లలో ఒకటిగా ఎదిగిన సీఎస్కే డబ్ల్యూపీఎల్‌లోకి అడుగు పెట్టనుంది. అయితే ఈ నిర్ణయం ఇప్పటికిప్పుడు అమల్లోకి రాదని ఆయన తెలిపారు. ఇది తమ భవిష్యత్తు కార్యాచరణలో భాగమని 'ఇన్వెస్ట్ ఇన్ తమిళనాడు' సదస్సులో వివరించారు. అలాగే ఇతర క్రీడల్లో కూడా సీఎస్కే తన అదృష్టాన్ని పరీక్షించుకుంటుందని పేర్కొన్నారు. 'ఇప్పటికిప్పుడు కాదు కానీ.. కచ్చితంగా త్వరలోనే సీఎస్కేను విస్తరిస్తాం. ముందుగా మేం మహిళల క్రికెట్‌లో అడుగు పెట్టబోతున్నాం. ఇతర క్రీడల్లోకి కూడా మేం రానున్నాం' అని ఆయన ఫ్రాంఛైజీ భవిష్యత్తు ప్రణాళికల గురించి అడిగినప్పుడు చెప్పారు. డబ్ల్యూపీఎల్‌లో ప్రస్తుతం ముంబయి, బెంగళూరు, ఢిల్లీ, గుజరాత్, ఉత్తరప్రదేశ్ ఫ్రాంఛైజీలు మాత్రమే ఉన్నాయి. ఐపీఎల్‌లో సత్తా చాటిన చెన్నై, పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ లాంటి జట్లు ఇంకా వుమెన్స్ లీగ్‌లోకి రాలేదు. ప్రస్తుతం డబ్ల్యూపీఎల్ 2026 సీజన్ ముగింపునకు చేరుకుంది. ఫిబ్రవరి 5న తుదిపోరు జరగనుంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఇప్పటికే ఫైనల్‌కు చేరుకుంది. మరికొన్ని గంటల్లో గుజరాత్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరగనుంది. ఇందులో గెలిచిన జట్టు ఫైనల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో పోటీపడనుంది.

# భారత్ పాక్ మ్యాచ్ జరగకపోయినా ఫర్వాలేదు —టీమ్ఇండియా మాజీ క్రికెటర్



టీ20 వరల్డ్‌కప్ 2026లో భాగంగా భారత్‌తో మ్యాచ్‌ను ఆడబోమని పాక్ ప్రకటించిన విషయం తెలిసిందే. కారణాన్ని మాత్రం వెల్లడించలేదు. ఈ నేపథ్యంలో టీమ్ఇండియా మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. భారత్ పాక్ మ్యాచ్ జరగకపోయినా ఫర్వాలేదన్నాడు. ప్రస్తుతం పాక్ జట్టు బలహీనంగా ఉందని, టీమ్ఇండియాకు తగిన పోటీ ఇచ్చే పరిస్థితిలో లేదని పేర్కొన్నాడు. అందుకే భారత్, పాక్ మ్యాచుల్లో మునుపటి మజా లేదన్నాడు. భారత్, పాక్ పోరు కంటే కూడా టీమ్ఇండియా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాతో తలపడుతుంటేనే ఉత్కంఠభరితంగా ఉంటోందని అభిప్రాయపడ్డాడు. 'భారత్, పాక్ మధ్య మ్యాచ్ జరగకున్నా.. ఫర్వాలేదు. చాలాకాలంగా భారత్, పాక్ మధ్య మ్యాచ్‌లు రసవత్తరంగా సాగడం లేదు. పూర్తి ఏకపక్షంగా ఫలితాలొస్తున్నాయి. కారణం.. పాక్ జట్టు 90వ దశకంలో ఉన్నట్లుగా బలంగా లేదు. ఇప్పుడు ఆ టీమ్ చాలా బలహీనంగా ఉంది. అసలు భారత్‌కు పోటీ ఇచ్చే పరిస్థితే లేదు. భారత్ ఆ టీమ్‌తో తలపడుతుంటే.. ఏదో చిన్న జట్టుతో మ్యాచ్ ఆడుతున్న ఫీల్ ఉంటోంది' అని విశ్లేషించాడు.

# బ్యాట్ పట్టుకోవడం రానివారికీ క్రికెట్ సంఘాల్లో సభ్యత్వమా?: సుప్రీం కోర్టు



క్రీడల్లో అనుభవం లేనివారు సంబంధిత సంఘాలను నిర్వహించడంపై సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. బ్యాట్ ఎలా పట్టుకోవాలో తెలియని వారికంటే.. మాజీ ఆటగాళ్లే క్రికెట్ సంఘాలకు నాయకత్వం వహించాలని పేర్కొంది. మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (MCA) ఎన్నికలపై బాంబే హైకోర్టు ఇచ్చిన స్టే ఉత్తర్వులను ఎత్తివేయడానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ విపుల్ పంచోలీలతో కూడిన ధర్మాసనం నిరాకరించింది. వాస్తవానికి, ఈ ఏడాది జనవరి 6న ఎంసీఏ ఎన్నికలు జరగాల్సింది. అయితే, సంఘంలో దాదాపు 401 మంది సభ్యులను ఆకస్మికంగా చేర్చడం ద్వారా ఓటర్ల జాబితాను తారుమారు చేస్తున్నారని ఆరోపిస్తూ.. మాజీ క్రికెటర్, భాజపా నేత కేదార్ జాదవ్ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. కొత్తగా నియమితులైన వారిలో చాలామంది ఎన్సీపీఎస్పీ ఎమ్మెల్యే రోహిత్ పవార్‌కు సమీప బంధువులు, వ్యాపార భాగస్వాములే ఉన్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీంతో బాంబే హైకోర్టు ఈ ఎన్నికలపై స్టే విధించింది. దీన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను సుప్రీం కోర్టు ధర్మాసనం విచారించింది. 1986నుంచి 2023 వరకు ఎంసీఏలో 164 మంది సభ్యులు ఉన్నారని, ఆ తర్వాత ఈ సంఖ్యలో భారీ పెరుగుదల కనిపించిందని రికార్డులను ప్రస్తావిస్తూ ధర్మాసనం పేర్కొంది. 2023 నుంచి బంపర్ డ్రా ఏమైనా తీశారా? అని పిటిషనర్లను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. ఒకవేళ అసోసియేషన్ తన మెంబర్‌షిప్‌ను విస్తరించాలనుకుంటే.. ఆ స్థానాలను మాజీ అంతర్జాతీయ ఆటగాళ్లకు కేటాయించి ఉండాల్సిందన్నారు. ''మన దేశంలో అద్భుతమైన క్రికెటర్లు ఉన్నారు. మాజీలు ఈ సభ్యత్వానికి మంచి ఎంపిక. కానీ.. ఆట గురించి ఏమాత్రం తెలియని వారిని, కనీసం బ్యాట్ ఎలా పట్టుకోవాలో అవగాహన లేని వారిని సంఘాల్లోకి తీసుకొస్తున్నారు. క్రికెటర్ల వల్లే క్రికెట్ సంఘాలు ఉన్నాయి తప్ప నిర్వాహకుల వల్ల కాదు'' అని సీజేఐ వ్యాఖ్యానించారు. అనంతరం ఈ పిటిషన్లను ఉపసంహరించుకోవడానికి పిటిషనర్లను అనుమతించిన ధర్మాసనం.. బాంబే హైకోర్టుకే వెళ్లాలని సూచించింది.

# 'పద్మ శ్రీ' అందుకోవడం నా జీవితంలో ఎంతో ప్రత్యేకమైన క్షణం: రోహిత్ శర్మ



భారత స్టార్ క్రికెటర్, మాజీ సారథి రోహిత్ శర్మ ఇటీవల 'పద్మ శ్రీ' అవార్డుకు ఎంపికయ్యాడు. తనకు ఈ పురస్కారం దక్కడంపై హిట్‌మ్యాన్ తాజాగా స్పందించాడు. ''పద్మ శ్రీని అందుకోవడం నాకు, నా కుటుంబానికి ప్రత్యేకమైన క్షణం. ఈ గౌరవాన్ని అందించిన భారత ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నాను. క్రికెట్ కెరీర్‌లో అండగా నిలిచిన వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నా. దేశం కోసం మ్యాచ్‌లు, ట్రోఫీలు గెలవడానికి నా ప్రయత్నం ఎప్పుడూ కొనసాగుతుంది. ధన్యవాదాలు. జై హింద్'' అని రోహిత్ పేర్కొన్నాడు. దూకుడైన బ్యాటింగ్‌తో హిట్‌మ్యాన్‌గా పేరుతెచ్చుకున్న రోహిత్ శర్మ.. కెప్టెన్‌గానూ భారత క్రికెట్‌పై బలమైన ముద్ర వేశాడు. అతడి సారథ్యంలోనే టీమ్ఇండియా 2024లో టీ20 ప్రపంచకప్‌ను గెలుచుకుంది. 2025లోనూ ఛాంపియన్స్ ట్రోఫీని కూడా చేజిక్కించుకుంది. రోహిత్ వన్డేల్లో 11577, టెస్టుల్లో 4301, టీ20ల్లో 4231 పరుగులు చేశాడు. అన్ని ఫార్మాట్లలో కలిపి 50 సెంచరీలు, 111 అర్ధసెంచరీలు సాధించాడు. టెస్టులు, టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన ఇతను వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్నాడు. 2027 వన్డే వరల్డ్ కప్‌లో ఆడాలని లక్ష్యంగా పెట్టుకున్న రోహిత్.. ఇటీవల న్యూజిలాండ్‌తో సిరీస్‌లో పెద్దగా రాణించలేదు. అంతకుముందు సఫారీలతో జరిగిన మూడు వన్డేల సిరీస్‌లో 146 పరుగులు చేశాడు.